


## జిల్లాకు చేరిన
# 1300 టన్నుల యూరియా

చింతకాని, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చింతకాని మండలం పందిళ్లపల్లి ర్యాక్ పాయింట్‌లో యూరియా, కాంప్లెక్స్ ఎరువుల పంపిణీని టెక్నికల్ ఏవో పవన్‌కుమార్ పరిశీలించారు. ర్యాక్ పాయింట్‌కు 1300 టన్నుల యూరియా, 1300 టన్నుల కాంప్లెక్స్ ఎరువులను ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలోని మార్క్‌ఫెడ్, ప్రైవేటు డీలర్లకు సరఫరా చేశామన్నారు.


# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



## ఖమ్మం
5
శుక్రవారం 24 అక్టోబరు 2025




# గుణపాఠం నేర్పేదెవరు?

గతంలో ముదిగొండ మండలంలో ఓ ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడొకరు.. ఓ ఉపాధ్యాయురాలి ఫోన్‌కు అసభ్య సందేశాలు పంపించడంతో ఆమె డీఈవోకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. కానీ కొన్నిరోజుల తర్వాత ఆ ఉపాధ్యాయుడు ఎంచక్కా.. మళ్లీ విధుల్లో చేరిపోయాడు. అలాగే కూసుమంచి మండలంలోని ఓ పాఠశాలలో ఓ ఆంగ్ల ఉపాధ్యాయుడు పదోతరగతి విద్యార్థినికి మాయమాటలు చెప్పి ప్రేమాయణం సాగించడం అప్పట్లో తీవ్ర సంచలనం రేపింది.

ఇక ఈ నెలలో ముదిగొండ, కూసుమంచి మండలాల్లో జరిగిన ఘటనలు విద్యావ్యవస్థ స్థాయిని దిగజార్చాయనే చెప్పాలి. ముదిగొండ మండలంలోని ఓ పాఠశాలలో పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరు తోటి సిబ్బందిపై, మరొకరు విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా.. ఎలాంటి చర్యలు లేవని తెలుస్తోంది. అయితే ఓ ఉపాధ్యాయుడిపై గతంలో కల్లూరు, బోనకల్ మండలాల్లో విధులు నిర్వహించిన సమయంలో లైంగిక వేధింపుల కేసు నమోదైంది. అయినా తీరు మారకపోవటంతో ఆయనను ముదిగొండ మండలంలోని పాఠశాలకు బదిలీ చేశారు. అక్కడా అదే పరిస్థితి. తాజాగా కూసుమంచి మండలంలో పనిచేసే ఉపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో అందరూ మందలించారు. దీంతో ఖమ్మం నగరానికి డిప్యూటేషన్‌పై వచ్చాడు. ఈ క్రమంలోనే బుధవారం సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.



- వృత్తిధర్మాన్ని మరుస్తున్న కొందరు ఉపాధ్యాయులు
- తరగతి గదుల్లో అకృత్యాలకు తెగబడుతున్న గురువులు
- అసభ్య ప్రవర్తనలతో అభాసుపాలు
- చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారుల మీనమేషాలు
- పదుల సంఖ్యలో ఘటనలు.. కొన్నింటిలోనే చర్యలు
- సస్పెండ్ చేస్తున్నా.. కేసులు నమోదవుతున్నా.. మారని తీరు
- పలుకుబడితో తప్పించుకుంటున్న వైనం
- ఇంకా కఠినంగా వ్యవహరించాలి అంటూ డిమాండ్లు

కొణిజర్ల మండలంలోని ఓ గురుకులంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు అదే పాఠశాలలో తొమ్మిదో తరగతి చదివే 14 ఏళ్ల బాలుడిపై కొంతకాలంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇటీవల ఆ విషయం వెలుగులోకి రావడంతో బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఆ టీచర్‌పై పోక్సో కేసు నమోదు చేశారు. దాంతో అవమాన భారానికి గురైన ఆ ఉపాధ్యాయుడు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

తల్లి.. తండ్రి.. గురువు.. దైవం అంటారు. కన్నవారి తర్వాత అంతటి ఉన్నత స్థానంలో ఉండే ఆ గురువులపై శిష్యులను కన్న బిడ్డలతో సమానంగా చూడడమేకాదు వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బృహత్తర బాధ్యత ఉంది. అలాంటి టీచర్లలో కొందరు తమ వృత్తి ధర్మాన్నే మరుస్తున్నారు. వయసు, విచక్షణ మరిచి అభం శుభం తెలియని ఆ చిన్నారుల హృదయాలను గాయపరుస్తున్నారు. విద్యార్థినులపై అసభ్య ప్రవర్తనలు, అకృత్యాలకు పాల్పడుతూ.. ఎంతో పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికి మాయని మచ్చలుగా మారుతున్నారు. ఇటీవలి కాలంలో జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు చేసిన అకృత్యాలు వెలుగులోకి రాగా.. పదుల సంఖ్యలో సంఘటనలు జరుగుతుంటే ఉన్నతాధికారులు కొన్నింటిలోనే చర్యలు తీసుకుంటుండటం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాఠాలు చెప్పే ఉపాధ్యాయులే గాడితప్పుతుంటే వారికి గుణపాఠాలు చెప్పేదెవరన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

- ఖమ్మం ఖానాపురంహవేలి, ఆంధ్రజ్యోతి

7

# పత్తికి.. తేమ దెబ్బ

- రైతన్నను ముంచుతున్న వానలు
- తొలివిడత పంట తీత సమయంలో వచ్చిన వర్షాలతో నష్టం
- రెండోతీత వేళా అదే దిగులు
- పంట నాణ్యత దెబ్బతిని ఆశించిన ధర దక్కని వైనం
- 'వరి' రైతులదీ అదే పరిస్థితి

ఖమ్మం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈ ఏడాది కాలం కలిసొస్తుందని ఆశించిన పత్తి రైతుకు దెబ్బ మీద దెబ్బ పడుతోంది. ఇప్పటికే తొలి విడత పత్తి తీత పూర్తవగా.. ఆ సమయంలో పడిన వానలు పంట నాణ్యతను దెబ్బతీశాయి. దాంతో రైతులు మద్దతు ధరను కోల్పోయి నష్టాలు మూటగట్టుకున్నారు. కనీసం రెండో దశ తీతలో అయినా తమకు కలిసొస్తుందనుకుంటే మళ్లీ వానలు వారిని నట్టేట ముంచుతున్నాయి. గురువారం జిల్లాలో పడిన వర్షం వారికి శాపంగా మారింది. మొదటి విడత పత్తి తీసిన సమయంలో వర్షం పడటంతో నాణ్యతలేక తీసిన పంటను స్థానిక వ్యాపారులకే క్వింటాకు రూ.6వేల పైబడి అమ్మాల్సి వచ్చింది. వాస్తవానికి వర్షాలు లేకపోతే పత్తి తీసుకుని ఇంటిలో మండేవేసి సీసీఐ కేంద్రాల్లో అమ్మితే క్వింటాకు రూ.8100మద్దతు ధర లభించేది. మళ్లీ ఇప్పుడు రెండో విడత పత్తిది కూడా అదే పరిస్థితి. ప్రస్తుతం జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగా.. 12శాతంలోపు తేమ ఉంటే క్వింటాకు రూ.8100 ధర చెల్లిస్తున్నారు. కానీ ప్రస్తుత వానల కారణంగా పత్తి తేమ శాతం అధికంగా వస్తోంది. దాంతో ఆశించిన ధర వచ్చే అవకాశాల్లేవు. వానలతో తేమ పెరగడంతో పాటు దూది నల్లబడుతోంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 3.50లక్షల ఎకరాల్లో పత్తి పంట పంట సాగవడగా.. జిన్నింగ్ మిల్లులున్నచోట సీసీఐ పత్తికొనుగోళ్లు జరుగుతున్నాయి. గ్రామాలు, మండల కేంద్రాలతో పాటు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. గుంటూరు, కోయంబత్తూరు, గుజరాత్, ఢిల్లీ, తమిళనాడు తదితరరాష్ట్రాల వ్యాపారులు ఏన్కూరు జూలూరుపాడు లాంటి మండలాలకు వచ్చిన నేరుగా పత్తి కొనుగోళ్లు చేస్తున్నారు. ఈ క్రమంలో వారు నాణ్యత పేరుతో కొర్రీలు పెట్టి క్వింటా ధరను రూ.వెయ్యి నుంచి 1500వరకు తగ్గించి కొంటున్నారు. వర్షాలు ఇలానే కురిస్తే సీసీఐ కేంద్రాల్లో కూడా ధర తగ్గించి కొనే పరిస్థితి ఉండగా.. రైతులు తొందరపడి ఎంతకోకొంతకు పంటను అమ్ముకుంటున్నారు.



పత్తి చేలో నీరు

**కోతకు వచ్చిన వరి.. రైతుల్లో భయం..**

ధాన్యం రైతులను కూడా ఈవర్షాలు భయపెడుతున్నాయి. ఇప్పటికే సత్తుపల్లి తదితర ప్రాంతాల్లో ముందుగా వేసిన వరిని కోస్తున్నారు. చాలాప్రాంతాల్లో పొట్ట,కోతదశలో ఉన్నాయి. ఈ క్రమంలో పడుతున్న వానలు దిగుబడులపై ప్రభావం చూపనున్నాయి. యెన్ను బరువు కారణంగా వరి పొలం నేలవాలే పరిస్థితి ఉంది. సాగర్ కాలవలో నీరు ఉండడం, వర్షాలు అధికంగా ఉండడంతో ధాన్యం రైతులు దిగుబడిపై ఆశలు పెట్టుకుంటున్నారు. వర్షాలు ఇలాగే ఉంటే ధాన్యం దిగుబడి తగ్గడంతో పాటు నాణ్యత కూడా తగ్గి ఆశించిన ధరలు రావని రైతులు దిగాలు చెందుతున్నారు.

## ఖమ్మం డీసీసీ కార్యాలయానికి
# ఎకరం కేటాయింపు

- కేబినెట్ భేటీలో ఆమోదం
- మంత్రి తుమ్మల విన్నపంతో సీఎం అంగీకారం
- కొత్తబస్టాండ్ సమీపంలో నిర్మాణం కానున్న భవనం



ఖమ్మం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి ) : కాంగ్రెస్ ఖమ్మం జిల్లా కార్యాలయానికి త్వరలో కొత్త భవనం రాబోతోంది. ఖమ్మం ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో భూమి కేటాయింపునకు సీఎం రేవంత్‌రెడ్డి అంగీకారం తెలిపారు. ఈ మేరకు గురువారం జరిగిన మంత్రి వర్గ సమావేశంలో మంత్రి తుమ్మల చేసిన ప్రతిపాదనను ఆమోదించారు. ప్రస్తుతం మయూరి సెంటర్‌లో ఉన్న భవనం పాతబడిపోవడం, కార్యాలయ నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో కొత్త భవనం అవసరముందని, మరోచోట స్థలం కేటాయించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ 2024 ఫిబ్రవరి 21న రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రాన్ని అందచేశారు. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న జిల్లా కార్యాలయాన్ని నగర కార్యాలయంగా మార్చి పార్టీ కార్యక్రమాలను వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ క్రమంలో ఖమ్మం ఎమ్మెల్యేగా తుమ్మల నాగేశ్వరరావు స్పందించి కాంగ్రెస్ జిల్లా కార్యాలయ కొత్త భవనం కోసం భూమి కేటాయించాలని, అందుకు ఖమ్మం కొత్త బస్టాండ్ సమీపంలోని బుర్హాన్‌పురం సర్వే నెంబర్ 93లో ఎకరం భూమి అనువుగా ఉందని, ఆ భూమిని కేటాయించాలని మంత్రి తుమ్మల సీఎంకు లేఖద్వారా వివరించారు. దాంతో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో తుమ్మల సూచన చేసిన ఎకరం భూమిని కేటాయిస్తూ ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి స్థలాన్ని కేటాయించడం ద్వారా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకుల కలలు నెరవేరబోతున్నాయని, త్వరలో ఈ భూమిలో ఆధునిక సౌకర్యాలతో కూడిన భవనాన్ని నిర్మించి కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని మంత్రి తుమ్మల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

## ప్రారంభానికి సిద్ధంగా
# యూపీహెచ్‌సీ భవనాలు

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు ఆరోగ్యాన్ని పంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం యూపీహెచ్‌సీలను అందుబాటులోకి తీసుకొస్తోంది. జిల్లాలో ఖమ్మం ఖానాపురంతో పాటు సత్తుపల్లిలోనూ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటికి ఒక్కో భవనానికి రూ.కోటి 43లక్షలతో అన్ని హంగులతో భవనాలను నిర్మిస్తోంది. దాదాపు ఇవి పూర్తి కావచ్చాయి. ఖమ్మం ఖానాపురంలో యూపీహెచ్‌సీ భవనం పూర్తయ్యింది. యూపీహెచ్‌సీ భవనాలను (జీ ప్లస్ వన్ ) రెండు అంతస్థులతో నిర్మిస్తున్నారు. మెడికల్ ఆఫీసర్ల గదులు, స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నీషియన్ గది, మందుల నిల్వ గది, రోగులు వేచి ఉండేందుకు ఇలా అన్ని సౌకర్యాలతో నిర్మిస్తున్నారు.

- సత్తుపల్లి, ఖానాపురం యూపీహెచ్‌సీలు నూతనంగా మంజూరు అయ్యాయి. దాదాపు వీటిని పూర్తి చేసి రంగులు వేశారు. ప్రతి 5 వేల జనాభాకు ఒక పీహెచ్‌సీ ఉండాలన్న లక్ష్యంతో నగరాల్లోనూ వీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. భవనంతో పాటు ఫర్నిచర్, ఇతర పరికరాలను వీటితో సదుపాయాలను సమకూర్చనున్నారు. మొత్తంగా రెండు నెలలో వీటిని ప్రారంభించనున్నట్టు జిల్లా వైద్యాధికారులు చెబుతున్నారు. ఖమ్మం నగరంలోని వెంకటేశ్వరనగర్ యూపీహెచ్‌సీకి పక్కాభవనం లేకపోవడంతో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. గతంలో వెంకటేశ్వరనగర్‌లో ఉన్నప్పుడు మున్నేరుకు వరదల సమయంలో ఈ యూపీహెచ్‌సీ పూర్తిగా నీట మునిగి మందులు, ఇతరత్రా సామగ్రి మొత్తం వరదార్పణం అయ్యింది. రెండేళ్లపాటు ఇదే కొనసాగింది. ఆ తర్వాత దానిని జూబ్లీపురకు మార్చారు. ఇక్కడ కూడా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం పాత డీఈవో కార్యాలయంలో పీహెచ్‌సీకి స్థలాన్ని కేటాయించారు. రూ.కోటి 43లక్షలతో పక్కా భవనాన్ని పూర్తి చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మునిసిపల్ అధికారులు ఈ భవనాన్ని పూర్తి చేశారు. ప్రస్తుతం దీన్ని మరో పక్షం రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలుస్తోంది. వీటితో పాటు బస్తీ దవాఖానాలకు, పల్లెదవాఖానాలకు కూడా పక్కా భవనాలను నిర్మించేందుకు ప్రతిపాదనలను పంపించినట్టు తెలిసింది.



ప్రారంభానికి సిద్ధంగా వెంకటేశ్వరనగర్ యూపీహెచ్‌సీ



దమ్మాయిగూడెంలో టన్నెల్ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

# 'సీతారామ' కెనాల్ పనులను గడువులోపు పూర్తిచేయాలి

- భూసేకరణలో జాప్యాన్ని నివారించాలి
- ఎప్పటికప్పుడు రైతులతో మాట్లాడి సమస్యల్లేకుండా చూడాలి
- నీటిపారుదల శాఖ అధికారులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాలు
- పాలేరు లింక్‌కెనాల్ టన్నెల్ పనుల పరిశీలన

తిరుమలాయపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ పాలేరు కెనాల్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. తిరుమలాయపాలెం మండలం బీరోలు, దమ్మాయిగూడెం గ్రామాల వద్ద జరుగుతున్న సీతారామ లిఫ్టు ఇరిగేషన్ 16వ ప్యాకేజీలోని పాలేరు లింక్‌కెనాల్ టన్నెల్ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామ పనులు 2026 ఖరీఫ్‌నాటికి (మిగతా 6వ పేజీలో)

# ఎక్సైజ్.. సిండికేట్!

- లక్కు కోసం కొందరు కానిస్టేబుళ్ల ప్రయత్నాలు
- బంధువుల పేరిట మద్యం దరఖాస్తుల దాఖలు
- వ్యాపారులతో కలిసి పెట్టుబడులు
- లాటరీ వేళ మధ్యవర్తిత్వానికి పావులు




ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మద్యం దుకాణాల దరఖాస్తుల దాఖలు ప్రక్రియ ముగిసింది. అయితే ఈ సారి ఉమ్మడి జిల్లాలోని ఎక్సైజ్‌శాఖకు చెందిన కొందరు ఉద్యోగులు తమ లక్కును పరీక్షించుకోబోతున్నట్టు సమాచారం. బంధువుల పేరుతో పదుల సంఖ్యలో మద్యం దుకాణాలకు దరఖాస్తులను చేశారు. కిందిస్థాయిలోని ఉద్యోగుల నుంచి సీఐ స్థాయిలోని అధికారుల వరకు కుటుంబ సభ్యులతో దరఖాస్తులు చేయించినట్టు తెలుస్తోంది. ఒక్కో ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని కానిస్టేబుళ్లు ఇతర సిబ్బంది కలిసి తమ కుటుంబ సభ్యుల పేర్లతో సిండికేట్ వ్యాపారులతో కలిసి దరఖాస్తులు చేయించారు. అయితే 2018 తర్వాత ఎక్సైజ్‌శాఖలో సీఐలు బదిలీలు జరిగినా.. కానిస్టేబుళ్ల బదిలీలు జరగలేదు. ఖమ్మం నగరంలోని రెండు ఎక్సైజ్ స్టేషన్‌లో అనుభవం కలిగిన సిబ్బంది ఉన్నారు. ఏడేళ్లుగా ఖమ్మంలోనే విధులు నిర్వహించటంతో మద్యం వ్యాపారులతో వారికి సత్సంబంధాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలోనే కొందరు ఆర్థికంగా బలోపేతమయ్యారన్న చర్చ ఎక్సైజ్‌శాఖలో జరుగుతోంది. కానిస్టేబుళ్లను విధులపై ప్రశ్నించిన ఎస్ఐ స్థాయి అధికారులకు కూడా ఖమ్మం నుంచి బదిలీలు జరిగాయి. ఈ క్రమంలోనే మద్యం దుకాణాలకు దరఖాస్తుల షెడ్యూల్ రావటంతో కొంతమంది ఎక్సైజ్‌శాఖ ఉద్యోగులు తమ లక్కును పరీక్షించుకునేందుకు ముందుకు వచ్చారు. స్టేషన్ల వారీగా ఉద్యోగులు సిండికేట్‌గా మారారు. తమ కుటుంబ సభ్యులు పేర్లతో బయట మద్యం వ్యాపారులను కలుపుకొని దరఖాస్తులు చేసి.. రూ.50వేల నుంచి రూ.2లక్షల వరకు పెట్టుబడి పెట్టారని ఎక్సైజ్‌శాఖలో చర్చ జరుగుతోంది.

**వ్యాపారులకు సాయమందించేందుకు..**

ఎక్సైజ్ దరఖాస్తుల తర్వాత లాటరీ సమయంలోనూ కొంతమంది సిబ్బంది మధ్య వర్తిత్వం వహిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దరఖాస్తుల స్వీకరణ సమయంలోనే రెగ్యులర్ మద్యం వ్యాపారం చేసే వారు కాకుండా కొత్తగా దరఖాస్తులు చేసిన వారి వివరాలను సిబ్బంది నమోదు చేస్తున్నారు. ఆ వ్యక్తుల్లో మద్యం లాటరీలో దుకాణాలు దక్కితే వెంటనే వారి పూర్తి సమాచారం మద్యం వ్యాపారులకు అందించి మధ్య వర్తిత్వం వహిస్తున్నారు. ఇలా చేసినందుకు మద్యం వ్యాపారులు బహుమతులు, పారితోషికాలు అందిస్తున్నారని బహిరంగ చర్చ జరుగుతోంది. గత అనుభవాల దృష్ట్యా ఈనెల 27న నిర్వహించే మద్యం లాటరీలో ఎక్సైజ్‌శాఖలో ఏళ్లుగా స్థిరపడిన వారికి కాకుండా కొత్తగా విధుల్లోకి చేరిన వారికి ఉద్యోగులకు విధులు కేటాయించి పారదర్శకంగా లాటరీ విధానం జరపాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

### 4,430 దరఖాస్తులు.. రూ.132.90కోట్లు

**ముగిసిన మద్యం అప్లికేషన్ల గడువు**

మద్యం షాపుల దరఖాస్తుల దాఖలు గడువు గురువారంతో ముగిసింది. వాస్తవానికి 18వతేదీనే గడువు ముగియగా.. మరో ఐదు రోజులు సమయమిచ్చారు. జిల్లాలో మొత్తం 116 మద్యం దుకాణాలకు 4,430 దరఖాస్తులు రాగా రాత్రి 9గంటల వరకు డిప్యూటీ కమిషనర్ జనార్ధాన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేంద్రరెడ్డి ఖమ్మంలోని 1టౌన్ ఎక్సైజ్ స్టేషన్ నుంచి పర్యవేక్షించారు. అయితే ఐదు రోజులు గడువు పెంపుతో అదనంగా 413 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఒక్క గురువారం రోజు 253 దరఖాస్తులు అందాయి. కారేపల్లి, ఎర్రుపాలెంతో పాటు ఏపీ సరిహద్దు మద్యం దుకాణాలకు దరఖాస్తుల భారీగా పెరిగాయి. కాగా 2023లో 7,207దరఖాస్తులు రాగా.. నాడు రూ.2లక్షల రుసుం ఉండటంతో 144.14కోట్లు ఆదాయం సమకూరింది. ఈ సారి దరఖాస్తు రుసుంను రూ.3లక్షలకు పెండగా.. మొత్తం 4,430 దరఖాస్తులు అందగా రూ.132.90కోట్లపైచిలుకు ఆదాయం వచ్చింది. అయితే ఫీజును రూ.3 లక్షలకు పెండంతో దరఖాస్తుల సంఖ్య తగ్గిందని, కానీ ఫీజు పెంపుతో గత ఆదాయానికి చేరువైందని చెబుతున్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

» పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, భిక్షం గౌడ్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే కాకుండా ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఉండే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి. దామోదర్‌రెడ్డి, ఎస్ భిక్షం గౌడ్ కోరారు. గురువారం కొత్తగూడెంలోని లక్ష్మీదేవిపల్లిలో జరిగిన జిల్లా స్థాయి పీఆర్టీయూ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు పి. నరసయ్య అధ్యక్షత వహించారు. రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల స మస్యల పరిష్కారానికి ప్రభుత్వం సముఖం గా ఉందని, ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలు ప్రతీనెల రూ. 700 కోట్లు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు పీఆర్సీ వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు వైద్య సౌకర్యం కోసం హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న స మస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పి. వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరసయ్య, కార్యదర్శి సీహెచ్ ప్రభాకర్ తదితరులు ప్రసంగించారు.


మాట్లాడుతున్న పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి

# దినసరి వేతన కార్మికుల సమ్మె తాత్కాలిక విరమణ

భద్రాచలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పని చేస్తున్న దినసరి వేతన కార్మికులకు తగ్గించిన వేతనాలు తిరిగి చెల్లిస్తామని గిరిజన సాంఘిక, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. గత 41 రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెలో ఉన్న జేఏసీ నాయకులు గురువారం మంత్రిని హైదరాబద్‌లో కలిశారు. జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని సమస్యల పరిస్కారంకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు జేఏసీ నాయకులు కె.బ్రహ్మచారి, బి.మధు, ఎం.పాపారావు, లక్ష్మణ్, జలందర్, నాగేశ్వరరావులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, జేఏసీ నాయకులు మంత్రిని కలవగా గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, మంత్రితో జరిగిన చర్చలు ఫలించాయని ఈ క్రమంలో సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నామని వివరించారు.


చర్చలు జరుపుతున్న కార్మికులు

# అయ్యప్ప భక్తులకు ఆర్టీసీ బస్సులు



» అద్దెకు ఇస్తున్న యాజమాన్యం
» తక్కువ ఖర్చుతో ఎక్స్‌ప్రెస్, లగ్జరీ సర్వీసులు

ఖమ్మం ఖానాపురంహవేలీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములకు ఆర్టీసీ బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఖమ్మం రీజియన్ పరిధిలోని ఆరు డిపోల నుం చి శబరిమల యాత్రకు అద్దెకు బస్సులు ఇస్తున్నారు. శబరిమల యాత్ర దూరంతో కూడుకున్నది కావడంతో కండీషన్‌లో ఉన్న బస్సుతోపాటు, అనుభవజ్ఞులైన డ్రైవర్లను ఆర్టీసీ సిద్ధం చేసింది. ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం, సత్తుపల్లి, మధిర, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు డిపోల నుంచి శబరికి బస్సులను బుక్ చేసుకునే సదుపాయం ఉంది. ప్రైవేటు ట్రావెల్స్ కంటే తక్కువ ధరలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు.

## కిలోమీటరుకు రూ.59కే

శబరిమల యాత్రకు బస్సు అద్దెకు బుక్ చేసుకున్న వారికి అన్ని బస్సుల్లో గురు స్వామికి, ఇద్దరు మణికంఠ స్వాములకు ఉచిత ప్రయాణం అందిస్తున్నారు. వీరితో పాటు వంట మాస్టర్‌కు, ఒక సహాయకుడికి బస్సులో ప్రయాణించేందుకు అవకాశం కల్పించారు. 36సీట్లు ఉండే సూపర్ లగ్జరీ బస్సులకు కిలోమీటరుకు రూ.59, చొప్పున ఆర్టీసీ అధికారులు అద్దె వసూలు చేయనున్నారు. అయ్యప్పస్వాములు మార్గ మధ్యలో వంట చేసుకునేందుకు వీలుగా వంట సామగ్రిని కూడా తీసుకెళ్లే వెసులుబాటును కల్పించారు. స్వాముల వెంట తెచ్చుకునే లగేజీకి ఎలాంటి అదనపు చార్జీ లేదు. ప్రయాణించే కిలోమీటర్ల ఆధారంగా కొంత అడ్వాన్స్ చెల్లించి బస్సులను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. టోల్‌గేట్, పార్కింగ్ చార్జీలు, పర్మిట్ చార్జీలు అద్దెకు తీసుకున్న వారే చెల్లించాలి. ఒక్కో బస్సుకు ఇద్దరు నిపుణులైన డ్రైవర్లను కేటాయించనున్నారు. ప్రైవేటు వాహనాలతో పోల్చితే ఆర్టీసీ అద్దె చాలా తక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు. బస్సులు అద్దెకు కావాలనుకునే వారు ఆయా డిపోల్లోని మేనేజర్లను సంప్రదించాల్సి ఉంటుంది.

## తీర్థయాత్రలకు కూడా

శబరిమలైతో పాటు భక్తులు చూడాలనుకునే తీర్థయాత్రలకు కూడా బస్సులను అందుబాటులో ఉంచారు. సమూహంగా వచ్చే భక్తులు వారు వెళ్లాలనుకునే ప్రదేశాల వివరాలను, టూర్ సమయం, ఎన్నిర రోజులో చెపితే ఆర్టీసీ అధికారులు దానికి అనుగునంగా బస్సులను ఎంగేజ్ చేస్తారు. వివరాలకు ఖమ్మం డిపో మేనేజర్, 9959225958, సత్తుపల్లి డిపో 9959225962, కొత్తగూడెం-9959225959, భద్రాచలం- 9959225960, మధిర - 9959225961, మణుగూరు- 9959225963 నెంబర్లను సంప్రదించాలని ఆర్ఎం తెలిపారు.

### అయ్యప్ప స్వాములు సద్వినియోగం చేసుకోవాలి



● సరిరాం, ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌ఖమ్మం,

ఆర్టీసీ శబరిమల యాత్ర భక్తుల కోసం ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇస్తున్నాం. కావాల్సిన భక్తులు ఆయా ఆర్టీసీ డిపోలలో సంప్రదించాలి. కిలోమీటరు చొప్పున, వెయిటింగ్ సమయాన్ని లెక్కగట్టి తగిన ధర నిర్ణయిస్తాం. దీన్ని అయ్యప్ప స్వాములు సద్వినియోగం చేసుకోవాలి.

# ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

» ప్రేమ, పెళ్లి అంటూ పోకిరీ పెట్టిన వేధింపులే కారణం
» కల్లూరు మండలం పేరువంచలో ఘటన

కల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకోగా.. అందుకు ప్రేమ పేరుతో ఓ పోకిరీ పెట్టిన వేధింపులే కారణమని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన కల్లూరు మండలం పేరువంచ గ్రామంలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి బాధిత కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలివీ.. పేరువంచ గ్రామానికి చెందిన కోనూరు జశ్విత(18) కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. తండ్రి వెంకటయ్య ఇంటి వద్దే చిన్న కిరాణా దుకాణం నిర్వహిస్తుండగా, తల్లి గోపమ్మ చంద్రుగొండలోని బీసీ బాలికల వసతి గృహంలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటోంది. ఆమె వారానికోసారి, సెలవు రోజుల్లో ఇంటికి వచ్చి వెళుతూ ఉంటుంది. వెంకటయ్య, గోపమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తె జాహ్నవి ఖమ్మంలో నర్సింగ్ విద్య చదువుతూ అక్కడే ఉంటోంది. కల్లూరులో ఇంటర్ సెకండియర్ చదువుతున్న రెండో కుమార్తె జశ్విత, తండ్రి వెంకటయ్య పేరువంచ అంబేద్కర్ కాలనీలోని తమ నివాసంలో ఉంటున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన అనిల్ అనే యువకుడు జశ్వితతో పరిచయం ఏర్పరుచుకున్నాడు. ఐటీఐ చదివి రెండేళ్లుగా ఖాళీగా తిరుగుతున్న అనిల్ మంగళవారం రాత్రి జశ్విత ఇంట్లోకి ప్రవేశించి ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా.. ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకోవాలంటూ వాగ్వాదానికి దిగాడు. దీంతో ఆమె కేకలు వేయగా ఇంటి బయట షాపులో ఉన్న తండ్రి వెంకటయ్య వచ్చి అనిల్‌ను అడ్డుకున్నాడు. రాత్రి సమయంలో ఇలా ఇంట్లోకి ప్రవేశించి తన కూతురిని ఎందుకు ఇబ్బంది పెడుతున్నావంటూ కోప్పడగా.. 'నీ బిడ్డను ప్రేమిస్తున్నాను. పెళ్లి చేసుకుంటా' అని కేకలు వేస్తూ చెప్పాడు. ఆ అరుపులు విన్న చుట్టుపక్కల వారు అక్కడి రావటంతో అనిల్ పరారయ్యాడు. అప్పటి నుంచి తన కూతురు జశ్విత భయం, మనోవేదనలో ఉందని, గురువారం ఉదయం తాను ఇంటి ఎదుట ఉన్న షాపులో వ్యాపారం చేసుకుంటుండగా జశ్విత ఇంట్లో ఫ్యాను ఉరేసుకుందని వెంకటయ్య పేర్కొన్నాడు. కొంతసేపటి తర్వాత తాను ఇంట్లోకివెళ్లగా తలుపులు లోపల నుంచి గడియ పెట్టి ఉందని, ఎంత పిలిచినా కూతురు పలకకపోవడంతో కిటికీలో నుంచి చూడగా తన బిడ్డ ఫ్యానుకు ఉరేసుకుని కనిపించిందన్నారు. చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు పగల గొట్టగా కొనఊపిరితో ఉన్న జశ్వితను స్థానిక ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా కొద్దిసేపటికి ఆమె మృతి చెందిందని వెంకటయ్య తెలిపాడు. ప్రేమ,పెళ్లి అంటూ అనిల్ పెట్టిన వేధింపులు, తన ఇంట్లోకి ప్రవేశించి అతడు తమ పట్ల వ్యవహరించిన తీరుతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదుతో అనిల్‌పై వేధింపుల కేసు నమోదు చేశామని, ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడని కల్లూరు ఎస్ఐ డి.హరిత తెలిపారు.


జశ్విత (ఫైల్ ఫొటో)

# నేనెవరో మీకు తెలియదా..!

» ఇక్కడకు పాత సిబ్బందినే తీసుకొస్తా
» రామాలయ ఎస్‌పీఎఫ్ సిబ్బందితో ఓ వ్యక్తి వాగ్వాదం
» దేవస్థానం ఈవోకు ఫిర్యాదు చేసిన సిబ్బంది

భద్రాచలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నేనెవరో మీకు తెలియదా.... ఏం బెదిరిస్తున్నావు...మీ సార్‌ను అడగండంటూ ఎస్‌పీఎఫ్ సిబ్బందిపై ఇటీవల దేవస్థానంలో కీలక అధికారులతో చురుగ్గా వ్యవహరిస్తున్న ఓ వ్యక్తి వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. గురువారం భద్రాచలంలోని రామాలయంలో దర్శనానికి సదరు వ్యక్తి సుమారు పది మంది వరకు భక్తులను తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ఆలయం మూసే వేళ సమీపిస్తుండటంతో అంతరాలయంలో విధుల్లో ఉన్న ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్ త్వరగా వెళ్లాలని కోరగా, దీంతో సదరు వ్యక్తి నేనెవరో మీకు తెలియదా?.. మీ సార్‌ని అడుగండని పేర్కొన్నట్లు వినికిడి. దీంతో ఈ విషయాన్ని సదరు కానిస్టేబుల్ ఎస్‌పీఎఫ్ హెడ్ దృష్టికి తీసుకెళ్లగా సదరు వ్యక్తి ఆయనతో సైతం అనుచితంగా మాట్లాడినట్లు సమాచారం. సిబ్బంది అంతా కొత్తవాళ్ల మీరెవరో చెబితే సరిపోయేది కదా అని అంటే, వీళ్లంతా కొత్తవాళ్లా అయితే పాతవాళ్లను తీసుకొస్తా అంటూ సదరు వ్యక్తి దురుసుగా మాట్లాడినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో ఈ విషయాన్ని భద్రాద్రి దేవస్థానం ఈవో దృష్టికి స్థానిక హెడ్ కానిస్టేబుళ్లు ఇరువురు తీసుకెళ్లి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదే క్రమంలో మమ్మల్ని శాసించడానికి ఆయనెవరని, అధికారుల మద్దతు లేకపోతే విధులు నిర్వహించడం కష్టమని ఎస్‌పీఎఫ్ సిబ్బంది స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. దీంతో దేవస్థానం ఈవో ఈ విషయమై తగిన చర్యలు తీసుకుంటానని వారితో పేర్కొన్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఈ విషయాన్ని ఎస్‌పీఎఫ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ విషయమై దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావును ఆంధ్రజ్యోతి సంప్రదించగా ఆలయంలో జరిగిన ఘటనపై రామాలయ సిబ్బందితో వివరాలు సేకరిస్తామని పేర్కొన్నారు.

# మహిళా సంఘాలకు 'సౌరశక్తి'

» వెంకటాపురంలో స్థలాన్ని పరిశీలించిన విద్యుత్ అధికారులు

ఎర్రుపాలెం, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ఇందిరాక్రాంతి పథకం స్వయం సహాయక మహిళ సంఘాలకు ఆర్థిక స్వావలంబన ఇచ్చేందుకు ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఇందుకోసంసోలార్ పవర్‌ప్లాంట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి విద్యుత్‌గ్రిడ్‌లకు అందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనిలో భాగంగా మండలంలోని రాజుపాలెం రెవెన్యూ పరిధిలోని వెంకటాపురంలో సబ్ స్టేషన్ సమీపంలో సర్వేనెంబరు 102లో గల ప్రభుత్వ భూమిలో 4 ఎకరాల భూమి గుర్తించారు. సోలార్ ప్లాంట్ నుంచి విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాటు చేయనున్న విద్యుత్ లైన్లను విద్యుత్‌శాఖ ఖమ్మం సర్కిల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు. సుమారు 1మె.వా. విద్యుత్‌ఉత్పత్తి చేసి సబ్‌స్టేషన్‌కు అనుసంధానించడం ద్వారా వచ్చే ఆదాయాన్ని ఐకేపీ ఆధ్వర్యంలో వెంకటాపురం, నారాయణపురం గ్రామాల మహిళ సంఘాలకు అందిస్తారు. ఈసోలార్ ఆధారంగా నిర్మించే మె.వా. విద్యుత్ ప్లాంట్‌కు సుమారు రూ.3కోట్లు ప్రభుత్వంఖర్చు చేయనుంది. సోలార్‌ప్లాంట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను యూనిట్ రూ.3.13కుకొనుగోలు చేసేందుకు ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఇప్పటికే ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. 25 ఏళ్లపాటు విద్యుత్ డిస్కంలు ఇలా విద్యుత్ కొనుగోలు చేయనున్నాయి. ఈపథకంతో పర్యావరణ పరిరక్షణతోపాటు కాలుష్యరహిత విద్యుత్‌ను ఉత్పత్తి చేయలని ప్రభుత్వం భావిస్తుంది. కేంద్రంప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం కుసుమ్ పథకంలో భాగంగా రాష్ట్రప్రభుత్వం 4వేల మెవా సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని యోచిస్తుంది. దీనిలో భాగంగా తెలంగాణలో మొట్టమొదటిసారిగా సోలార్‌ప్లాంట్‌ను తన నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పట్టుబట్టి తీవ్రకృషి చేస్తున్నారు.

# మంత్రాల నెపంతో హత్య?

**చుంచుపల్లి మండలంలో ఘటన**

చుంచుపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మంత్రాలు చేస్తున్నాడని కారణంతోనే ఓ వ్యక్తిని హత్య చేసినట్లు తెలుస్తోంది. కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఈ ఘటన జరిగింది. స్థానికుల వివరాల ప్రకార.. చుంచుపల్లి మండలంలోని పెనగడప గ్రామపంచాయతీలోని మర్రిగూడెం ఆదివాసీఏజెన్సీ ప్రాంతంలో నివసించే గొత్తి కోయ పద్దం నందయ్య (56)ను ఇద్దరు వక్తులు హత్య చేశారు. నిందితులు రాజు, వెంకటేశ్వర్లుగా భావిస్తున్నారు. మర్రిగూడెం ప్రాంతంలో పెద్దమనిషిగా కొనసాగుతున్న నందయ్యను దారుణంగా హత్య చేసి వాగులో పడేసినట్లు తెలుస్తోంది. మంత్రాలు చేస్తున్నాడని కారణంతోనే నందయ్యను హత్య చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. నిందితులలో ఒకరైన వెంకటేశ్వర్లు, పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. మరో నిందితుడు రాజు కోసం గాలిస్తున్నట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

# సత్తుపల్లిలో వరికోతలు ప్రారంభం

» మండలంలో 19,600 ఎకరాల్లో వరిసాగు
» 43వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా

సత్తుపల్లిరూరల్,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో ఆటుపోట్లను తట్టుకుంటూ వ్యవసాయం చేసిన అన్నదాతలు వరికోతలకు శ్రీకారం చుట్టారు. సాగునీరు, బోర్లు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వరి పంటను రైతులు సీజన్ ప్రారంభానికి నెలరోజుల ముందుగానే సాగు చేపట్టారు. అయితే వరి పంట చేతికందుతుండగా వర్షాలు అడపాదడపా కురుస్తుండటంతో, తుఫాను ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు ఆందోళనలో పడ్డారు. ప్రస్తుతం కోతలను ప్రారంభించిన కర్షకులు కొంతమంది అకాల వర్షాల భయంలో ఉండగా మరికొద్ది రోజుల్లో వరికోతలు ముమ్మరం కానున్నాయి.

**మండలంలో 19,600ఎకరాలలో వరిసాగు**

సత్తుపల్లి మండలంలో సుమారు 19,600వేల ఎకరాలలో వరి పంట పండించగా సుమారు 43వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో 10వేల మెట్రిక్ టన్నులు గృహఅవసరాలకు పోగా మిగతావి కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏఓ మైత్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలో ఎంటీయూ1224సుమారు 80శాతం వేయగా 1262, 6204, హెచ్ఎంటీ లాంటి సన్నరకాలు సాగు చేయగా ఎకరానికి 20-22క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. మిగతా మండలాలతో పోలిస్తే చెరువులలో సమృద్ధిగా నీరు చేరడంతో నెలకు ముందుగానే వరికోతలకు చేరుకున్నాయి. మండలంలో ఇప్పటికే సిద్దారం, సదాశివునిపాలెం, కాకర్లపల్లి, బేతుపల్లి, రామానగరం, తదితర గ్రామాల్లో కోతలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర, బోనస్‌తో సంబంధం లేకుండా అకాల వర్షాల నేపథ్యంలో రైతు పండించి కోసిన పచ్చి వడ్లను దళారులు క్వింటాకు రూ.1400-1500కు విక్రయించే అవకాశం ఉంది. అడపాదడపా వర్షాల నేపథ్యంలో ఈసారైన ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరచి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.


తుంబూరులో వరికోతను పరిశీలిస్తున్న ఏడీఏ, ఏవో

# ఎవరి స్వలాభం కోసం ఈ పనులు?

» గతేడాది అమ్మఆదర్శ పాఠశాలలో పూరైన పనులకు మళ్లీ నిధుల మంజూరు

ఆళ్లపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గతేడాది అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో అధికారుల పర్యవేక్షణ లోపంతో డొళ్లతనాన్ని గుర్తించి, మరోసారి నిధులు మంజూరు చేశారా..? లేక అధికారుల కమీషన్ల, వారి స్వలాభం కోసం వారి ప్రతిపాదనలకు నిధులు మంజూరు చేయించారో.. తెలియదు కాని పాఠశాలలకు మరమ్మతులు చేసి ఏడాది పూర్తి అవ్వక ముందు మరోసారి ఆళ్లపల్లి మండలంలో రెయిన్ ఎఫెక్ట్ ద్వారా ఇప్పనపల్లి, పాతూరు, మర్కోడు జిల్లా పరిషత్ పాఠశాలలకు ఒక్కో పాఠశాలకు రూ.2 లక్షలు మంజూరు చేసింది.

గతేడాది ప్రభుత్వం అమ్మఆదర్శ పాఠశాల పథకం ద్వారా ఇదే పాఠశాలలకు రూ.2 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు నిధులు కేటాయించి, స్థానిక వీవో సభ్యుల ద్వారా మరమ్మతుల పనులు చేయించింది. ఏడాది పూర్తి కాకముందే అవే పనులతో పాటు రంగులు వేసేందుకు మరోసారి నిధులు మంజూరు కావడం గమనార్హం.

పాఠశాలలకు నిధులు మంజూరు చేయడం మంచిదే అయినపటికీ, వాటిని సద్వినియోగం చేసేలా మండల విద్యాశాఖ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో పాఠశాల అభివృద్ధి ఉపయోగపడేలా ఓ ప్రణాళిక చేస్తే నిధులు సద్వినియోగంగా ఉపయోగపడేవి, కాగా ఇక్కడ అధికారుల సమన్వలోపం, పరవేక్షణ లేక ఇష్టారా జ్యం కావడంతో నిధులు వృథా అవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటు న్నారు. మర్కోడు జిల్లా పరిషత్, ఇప్పనపల్లి, పాఠశాలల భవనాలు వర్షాలకు కురుస్తున్నాయని 2024 సెప్టెంబరులో స్లాబ్‌పై మరమ్మతులు చేశారు. అదే స్లాబ్‌పై రెయిన్ ఎఫెక్ట్ పై నేడు మరమ్మతుల పనులు నిర్వహించడం గమనార్హం.

అంటే గతేడాది చేసిన పనుల్లో డొళ్లతనం గుర్తించినట్టు ఇక్కడ స్పష్టంగా అర్థమవుతోంది. ఇప్పటికే అనేక పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతుంటే అధికారులు చేయించాల్సిన పనులు వదిలేసి, ఇష్టారాజ్యంగా, పనులను పర్యవేక్షించకుండా కమీషన్ల కోసం, కాంట్రాక్టర్లను ప్రోత్సహిస్తు చేతులు దులుపుకుంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. జిల్లా అధికారులు ఇకనైనా పాఠశాల అభివృద్ధి పనులు, నిధుల విషయంలో ఉపాధ్యాయుల, విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వామ్యం చేసి, ఒక ప్రణాళికతో పనులు చేయాలని పలువురు కోరుతున్నారు.



రెండు దఫాలు మరమ్మతులు చేసిన పాఠశాల భవనం

## 'సీతారామ' కెనాల్ పనులను
# గడువులోపు పూర్తి చేయాలి

(5వ పేజీ తరువాయి)

పనులు పూర్తి చేసి, ఈ ప్రాంత వాసులకు గోదావరి జలాలను అందించాలని ఆయన నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. టన్నెల్ నిర్మాణంలో ఎదురవుతున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పనుల వేగంగా జరిగేలా చూడాలని కోరారు. 8.2కిలోమీటర్ల సొరంగం తవ్వకం పనులకు గాను.. రోజు 24మీటర్ల మేరకు పనులు చేపట్టి ఇప్పటి వరకు 4కి.మీ పూర్తిచేశామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దాంతో మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తిచేయాలని సీతారామ ప్రాజెక్టు పనుల్లో భాగంగా పోచారం వద్ద పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులు పూర్తిచేయాలన్నారు.భూసేకరణ కూడా జాప్యం జరగకుండా అధికారులు ఎప్పటికప్పుడు రైతులతో మాట్లాడి పనులు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈప్రాజెక్టు పనులు పూర్తయితే ఈప్రాంతంలోని బీడుభూములకు శాశ్వతం సాగునీరందించే అవకాశం ఉందన్నారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు, ఈఈ రమేష్‌రెడ్డి, తహసీల్దార్ లూధర్‌విల్సన్ తదితరులున్నారు.

# బాలుడిపై మరో బాలుడు లైంగికదాడికి యత్నం

ఖమ్మంక్రైం, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): ఓ బాలుడిపై మరో బాలుడు లైంగిక దాడికి యత్నించాడు. ఈఘటనపై ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్‌లో గురువారంరాత్రి ఫిర్యాదు అందినట్లు తెలిసింది. అర్బన్ పరిధిలోని ఓప్రాంతానికి చెందిన విద్యార్థి ఏడో తరగతి చదువుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన మరో విద్యార్థి లైంగిక దాడికి ప్రయత్నించాడు. దీంతో సదరు విద్యార్థి తల్లిదండ్రులు ఖనాపురం హవేలీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కోర్టు ఆదేశాల మేరకు సదరు విద్యార్థిని నగరంలోని చైల్డ్ హోమ్‌కు తరలించినట్లు తెలిసింది. బాధితుడి వయస్సు పన్నెండేళ్లుగా, నిందితుడి వయస్సు పదమూడేళ్ల ఉండటం గమనార్హం.

# 5లక్షల మందితో సీపీఐ శతవసంతాల సభ

» పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బాగం హేమంతరావు

కొణిజర్ల, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): సీపీఐ వందేళ్ల పండుగలో ఐదులక్షల మందితో బహిరంగ సభ నిర్వహిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. గురువారం కొణిజర్ల మండల కేంద్రంలోని దొండపాటి వెంకయ్య భవన్‌లో జరిగిన కొణిజర్ల మండల కౌన్సిల్ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ముగిపు మహోత్సవాలను మన ఖమ్మంలో జరుపుకోవం చాలా ఆనందంగా ఉందన్నారు. పార్టీ శ్రేణులు కూడా ఆ మహాసభను మరెన్నడు చూడని రీతిలో అంగరంగవైభవంగా జరుపుకుని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశం అంటేనే భిన్నత్వంలో ఏకత్వం అని అటువంటి ఏకత్వాన్ని కాపాడడంలో సీపీఐ అగ్రశ్రేణిలో ఉందన్నారు. సీపీఐ శత వసంతాల ముగింపు సందర్భంగా పార్టీ శ్రేణులన్నీ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి మహాసభకు రావల్సిందిగా ఆహ్వానించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ గ్రామపార్టీ శాఖలుప్రజాసంఘాల బాధ్యులను కలుపుకుని ఐకమత్యంగా శతవసంతోత్సవాల ముగిపు సభను చరిత్రలో మిగిలిపోయే విధంగా జయప్రదం చేయాలని కోరారు. కార్యకర్తలదరు ఎర్రచొక్కాలతో, ఎర్రచీరలతో కవాతు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లానాయకులు యర్రాబాబు, దొండపాటి రమేష్ మండల కార్యదర్శి గడల భాస్కరరావు, మునిగేకోటేశ్వరరావు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, స్వర్ణ రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# బార్‌కౌన్సిల్ ఎన్నికలపై సమావేశం

ఖమ్మంలీగల్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ఖమ్మంబార్‌అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం బార్‌అసోసియేషన్‌హాల్లో ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బార్ కౌన్సిల్ సభ్యుడు పి.విష్ణువర్ధన్‌రెడ్డి హాజరై న్యాయవాదులను ఉద్దేశించి ప్రసంగించారు. బార్‌కౌన్సిల్ ఎన్నికల గురించి, బార్‌అసోసియేషన్ సభ్యుల సమస్యలపై బార్‌కౌన్సిల్‌లో పరిష్కరించిన విషయాలను వివరించారు. రాబోయే బార్‌కౌన్సిల్ ఎన్నికలు జనవరి 31లోపు జరుగుతాయని చెప్పారు.ఈ సమావేశంలో బార్‌కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, కార్యదర్శి గద్దల దిలీప్‌కుమార్, అసోసియేషన్ కార్యవరగంతోపాటు సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

## బాధితులకు సత్వర న్యాయం అందించాలి: ఎస్పీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

టేకులపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. గురువారం మండలంలోని బోడు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించే సిబ్బందికి సంబంధించిన ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేశారు. అక్కడ ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడి వారి విధులకు సంబంధించిన సూచనలు చేశారు. పోలీసు స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చేవిధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. పోలీసు స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసు స్టేషన్‌లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరును పరిశీలించారు. పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా నిత్యం ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాలతో సంచరిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. డయల్ 100కు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు. పోలీసు స్టేషన్‌లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, సీఐలు బత్తుల సత్యనారాయణ, తాటిపాముల సురేష్, ఎస్ఐ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగుల పదవీ విరమణ బకాయిలు చెల్లించాలి

» ఎమ్మెల్యే కూనంనేనికి రిటైర్డ్ ఎమ్ప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఎమ్ప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

లక్ష్మీదేవిపల్లి, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): 2024 మార్చి నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు (బెనిఫిట్స్) చెల్లించాల్సిన అన్ని బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన రిటైర్డ్ ఎమ్ప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం కొత్తగూడెంలో సీపీఐ రాష్ట్రకార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును పదవీ విరమణ ఉద్యోగులు కలిసి తమ సమస్యలను పరిష్కరించాలనీ కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. 2024 మార్చి నుంచి గడిచిన 18నెలలు ఎటువంటి పదవీ విరమణ బకాయిలు అందలేదని దీంతో తమ కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 12వేల మంది పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఎమ్మెల్యే కూనంనేని స్పందిస్తూ పదవీ విరమణ ఉద్యోగులు పడుతున్న ఆర్థిక, మానసిక ఇబ్బందులను అసెంబ్లీలో జీరో అవర్లో ప్రస్తావిస్తానని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషిచేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శిలు సింగారపు జయరాం, యం.భారతి, నాయకులు మూర్తి రామారావు, ముత్యం, శ్రీనివాస్, రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# గుణపాఠం.. నేర్పేదెవరు?



» వృత్తిధర్మాన్ని మరుస్తున్న కొందరు ఉపాధ్యాయులు
» తరగతి గదుల్లో అకృత్యాలకు తెగబడుతున్న గురువులు
» చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారుల మీనమేషాలు
» పదుల సంఖ్యలో ఘటనలు.. కొన్నిటిలోనే చర్యలు
» సస్పెండ్ చేస్తున్నా.. కేసులు నమోదవుతున్నా మారని తీరు
» పలుకుబడితో తప్పించుకుంటున్న వైనం

ఖమ్మంఖానాపురంహవేలి అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : తరగతి గది అయినా.. పనిప్రదేశమైనా.. మైనర్లపై దుశ్చర్యలను నియంత్రించేందుకు ప్రభుత్వాలు ఎన్నో చట్టాలను తెచ్చాయి. తెస్తున్నాయి. వారి పట్ల ఏదైనా లైంగిక పరమైన అకృత్యం జరిగినప్పుడు వెంటనే పోక్సో కేసులు పెడుతూ వారిని కటకటాలకు పంపుతున్నారు. కానీ చిన్నారులకు దేవాలయాల్లాంటి పాఠశాలల్లోనూ రక్షణ కరువవుతోంది. ముఖ్యంగా విద్యార్థినుల పట్ల కొందరు ఉపాధ్యాయులు వ్యవహరిస్తున్న తీరు ఆ వృత్తికి మాయని మచ్చగా మారుతోంది. తమ శాఖలో ఇంత జరుగుతున్నా కొందరు ఉన్నతాధికారులు తమకేమీ తెలియదన్నట్టుగా వ్యవహరిస్తున్నారని, తూతూ మంత్రపు చర్యలు తీసుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంఘటన వెలుగులోకి రాగానే సంబంధిత ఉపాధ్యాయుడిని తొలుత సెలవులో పంపించడం. కొద్దిరోజుల తర్వాత మళ్లీ విధుల్లోకి తీసుకోవడం పరిపాటిగా మారుతోందన్న చర్చ జరుగుతోంది. దీని వెనుక 'రాజకీయం' జరుగుతోందని, భారీగా సొమ్ము చేతులు మారుతోందన్న ఆరోపణలున్నాయి. ఈ కారణంగానే పదుల సంఖ్యలో ఘటనలు జరిగితే ఒకటి, రెండు సంఘటనల్లో మాత్రమే ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్టుగా తెలుస్తోంది. అయినా సదరు టీచర్లు ఆరు నెలలో, సంవత్సరం తర్వాతో తిరిగి ఉద్యోగంలో చేరి మళ్లీ అదే ప్రవర్తనతో విద్యార్థుల చిన్ని హృదయాలను గాయపరుస్తున్నారు. ఇలాంటి వివాదాలు, ఘటనల్లో పలువురు రాజకీయ నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు చక్రం తిప్పుతున్నారన్నది బహిరంగ సత్యమే.

### గతంలో జరిగిన సంఘటనల్లో కొన్ని..

● తిరుమలాయపాలెం మండలంలో ఒకసారి విద్యార్థినిలపై వేధింపులకు పాల్పడిన ఓ ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించారు. ఆ తర్వాత కొద్దిరోజులకు ఆయనకు మళ్లీ విధులు అప్పగించారు. కానీ మళ్లీ ఉన్నత చదువుల పేరిట మరో విద్యార్థినిపై అకృత్యానికి పాల్పడ్డాడు. పక్కా ప్రణాళికతో విద్యార్థినికి, ఆమె తల్లిదండ్రులకు చేరువై నమ్మించి మోసగించాడు.

● ఖమ్మంరూరల్ మండలంలో కొందరు విద్యార్థినులకు సెల్‌ఫోన్‌లో అశ్లీల చిత్రాలు చూపుతుండటంతో భయపడిన విద్యార్థినులు స్కూలుకు రావడం మానేశారు. అదేంటని తల్లిదండ్రులు ఆరా తీయగా చిన్నారులు సదరు ఉపాధ్యాయుడి నిర్వాకాన్ని బయట పెట్టారు. దాంతో తీవ్ర ఆగ్రహా నికిలోనైన గ్రామస్థులు ఆ ఉపాధ్యాయుడిని చితకబాదారు.

● కామేపల్లి మండలంలో ఓ ఉపాధ్యాయుడు. అదే పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిని లైంగికంగా వేధించాడు. రోజూ మద్యం తాగి పాఠశాలకు వచ్చి విచక్షణ మరిచి ఇబ్బందులు పెడుతుండటంతో ఆ బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో విద్యార్థి సంఘాలతో కలిసి తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు.

● ఖమ్మం అర్బన్ మండలం పాండురంగాపురంలో పాఠాలు చెబుతున్నట్టుగా నటిస్తూనే మరోవైపు విద్యార్థిని తన పక్కకు పిలిచి భుజంపై చేయి వేసి తాకరాని చోట తాకి అసభ్యంగా ప్రవర్తించాడు ఓ ఉపాధ్యాయుడు. విద్యార్థులను మరోవైపు తిప్పి కూర్చోబెట్టి మరీ సదరు విద్యార్థిని పట్ల పైశాచికంగా వ్యవహరించిన ఘటన వెలుగులోకి వచ్చింది. అయినా అతడిపై ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం.

● తాజాగా వైరా మండలంలో గాంధీ సినిమా ప్రదర్శన సందర్భంగా ఓ ప్రధానోపాధ్యాయుడు బాలికల మధ్యన కూర్చుని అసభ్యంగా ప్రవర్తించాడు. విద్యార్థినులు తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి మంగళవారం ఆర్జేడీ సదరు ప్రధానో పాధ్యాయుడిని సస్పెండ్ చేయగా పోలీసులు కూడా కేసు నమోదు చేశారు.

### ఘటనలకు వేదికలవుతున్న తరగతి గదులు

విద్యార్థినులను నమ్మించి మోసం చేయడం, వారిని లోబర్చుకోవడం, వేధింపులకు గురిచేయడం, అశ్లీల చిత్రాలు చూపడం.. ఇలా ఒకటా, రెండా జిల్లా లో పదులసంఖ్యలో ఇలాంటి కీచకుల ఘటనలు వెలుగు లోకి వస్తూనే ఉన్నాయి. అయితే వీటన్నిటికి తరగతి గదులే వేదికలవడం గమనార్హం. కొన్నిసార్లు ఉపాధ్యాయులు తమపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని విద్యార్థినులు గ్రహిస్తున్నా బయటపెట్టేందుకు భయపడుతున్నారు. ఒకవేళ తల్లిదండ్రులకు చెప్పినా వారూ తమ పరువుపోతుందన్న భావనలతో తమలో తామే మదనపడుతున్నారని తెలుస్తోంది. అయితే ఇలాంటి సంఘటన ఏదైనా జరిగిన తర్వాత రెండు,మూడు రోజులు హడావుడి చేస్తున్న అధికారులు ఆతరువాత సంబంధిత ఉపాధ్యాయులపై ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదనే విమర్శలు వినపడుతున్నాయి. భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా ఉండాలంటే కీచక టీచర్లపై కఠినచర్యలు తీసుకోవాల్సిందేనని, సస్పెండ్ లాంటివి కాకుండా ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించాల్సిందేనని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

## వైద్య విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలి

» కలెక్టర్ జితేష్ వి పాటిల్



కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులకు అన్నీ సదుపాయాలు కల్పించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించి అన్ని విభాగాలు, వసతులు , నిర్మాణ పనుల పురోగతిని , పరిసరాలను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ నూతనంగా నిర్మాణంలో ఉన్న కళాశాల వసతి భవనాల నాణ్యత ప్రమాణాలతోనే త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ఎంబీ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా కళాశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్య కళాశాల అభివృద్ధి అంటే విద్యార్థుల సమగ్ర అభివృద్ధి అని, వారికి సౌకర్యవంతమైన వసతి, పరిశుభ్రమైన ఆవరణ, ఉత్తమ విద్యా వా తావరణం, ఆధునిక పరికరాలు అందుబాటులో ఉండాలన్నారు. వైద్య విద్యార్థుల భవిష్యత్తు దేశ ఆరోగ్య రక్షణకు పునాది అవుతుందని, కళాశాల అభివృద్ధిని ప్రాధాన్యంగా తీసుకోవాలన్నారు. కళాశాల ఆవరణలో పచ్చదనం ఉట్టిపడేలా మొక్కలను నాటాలని, సూచించారు. వివిధ ప్రాంతా ల నుంచి విద్యార్థులు సులభంగా కళాశాలకు చేరుకునేలా బస్సు ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేసి బస్సు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్, ఏడీఈ కోటేశ్వరరావు, అధ్యాపకులు డాక్టర్ సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం-వెంకటాపురం

## రహదారి ఇంత అధ్వానమా !

» మీరు నాకు చెప్పే వరకు నా దృష్టికి రాలేదు

» రహదారిని పునర్నిర్మిస్తాం: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):: భద్రాచలం-వెంకటాపురం మధ్య ఉన్న రహదారి ఇంత అధ్వానంగా ఉందా? మీరు చెప్పే వరకు ఈ విషయం నా దృష్టికి రాలేదని రాష్ట్ర ఆర్.అండ్.బి. శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సీపీఎం బృందంతో పేర్కొన్నారు. ఈ రహదారిని పునర్ నిర్మించేందుకు సత్వరమే చర్యలు తీసుకుంటామని ఆయన వారితో అన్నారు.

వెంకటాపురం మధ్య 120 కి.మీ. రహదారికి నిధులు మంజూరు చేసి పునర్ నిర్మించాలని కోరుతూ హైదరాబాద్‌లో రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల సీపీఎం కార్యదర్శులు మచ్చ వెంకటేశ్వర్లు, సూది కృష్ణారెడ్డిలతో కూడిన బృందం వినతి పత్రం అందించారు. ఇసుక లారీల వలన రోడ్డు మొత్తం పాడై భారీ గుంతలతో భయానకంగా మారిందని, ఇప్పటికే రోడ్డు మరమ్మత్తులు లేక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తక్షణమే తగిన నిధులు మంజూరు చేసి ఆ రోడ్డుకు మరమ్మతులు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. సానుకూలంగా స్పందించిన మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ పాలనలో అక్రమంగా గోవుల రవాణా

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు



నిరసనలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఖమ్మంక్రైం , అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో కొంతమంది అక్రమంగా గోవుల రవాణా చేస్తున్నారని, గోవులను రవాణా చేయటం వెనుక పెద్ద మాఫియా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆరోపించారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ వద్ద గోవులను అక్రమంగా తరలిస్తుండగా అడ్డుకున్న గోరక్షకుడు సోను(ప్రశాంత్)పై ఎంఐఎంకు చెందిన పలువురు తుపాకీ కాల్పులు జరిపిన ఘటనకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావును పోలీసులు అరెస్టుచేయటంపై గురువారం సాయంత్రం జడ్‌పీ సెంటర్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ గోవులను రక్షించేందుకు కృషి చేస్తున్న సోనుపై తుపాకీ కాల్పులు జరపడం హిందూ ధర్మంపై దాడి అని, దీనిపై ప్రశ్నించిన రామచంద్రరావుని ప్రభుత్వం అరెస్టు చేయడం దౌర్జన్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శులు గుత్తా వెంకటేశ్వర్లు, నల్లగట్టు ప్రవీణ్‌కుమార్, సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు, నున్న రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ రవి, వీరవెల్లి రాజేష్, బండారు నరేష్, నకిరకంటి వీరభద్రం, శ్రీరామనేని మణి, మందా సరస్వతి తదితరులున్నారు.

## అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

భద్రాచలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని బ్రిడ్జి రోడ్డులో పోలీసు చెక్‌పోస్టు వద్ద గురువారం బొలేరా వాహనంలో అక్రమంగా తరలిస్తున్న గోవులు, ఎద్దులు, లేగదూడలను పోలీసులు పట్టుకున్నారు. వాటిని తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అలాగే పట్టుకున్న నాలుగు ఆవులు, నాలుగు ఎద్దులు, మూడు లేగదూడలను పాల్వంచలోని గోశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మందలపల్లి వద్ద ఇసుక లారీ..

దమ్మపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా నుంచి అక్రమంగా సత్తుపల్లి ప్రాంతానికి వస్తున్న ఇసుక లారీని గురువారం దమ్మపేట పోలీసులు పట్టుకున్నారు. దమ్మపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మందలపల్లి క్రాస్ రోడ్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఇసుకతో వస్తున్న లారీ ఆపి తనిఖీ చేశారు. ఇసుక లారీకి సంబంధించి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అదనపు ఎస్ఐ బాలస్వామి నందం, ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి లారీని సీజ్ చేసి, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

## అదుపుతప్పి యాష్ ట్యాంకర్ బోల్తా

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): అతివేగంతో అదుపుతప్పి యాష్ ట్యాంకర్ పల్టీ కొట్టింది. ఈ సంఘటన కొత్తగూడెం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద గురువారం తెల్లవారుజామున జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో చోటు చేసుకుంది. భద్రాచలం నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న యాష్ ట్యాంకర్ అండర్ బ్రిడ్జి వద్ద డివైడర్‌పై పడింది. ఈక్రమంలో అదే మార్గంలో బస్టాండ్ వైపునకు రోడ్డుపై వెళ్తున్న మరో వాహనాన్ని ఢీకొంది. ఈ సమయంలో రోడ్డుపై వాహనదారులు, వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రధాన రహదారిపై యాష్ ట్యాంకర్ పల్టీ కొట్టి ఉండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. కొత్తగూడెం ట్రాఫిక్, వన్‌టౌన్, త్రీటౌన్ పోలీసులు రక్షణ చర్యలు చేపట్టారు.

## పత్తికి పట్టా రక్ష

» ఖమ్మం మార్కెట్‌లో వాన నుంచి పంటను కాపాడిన టార్పాలిన్లు



మార్కెట్‌లో పత్తి బస్తాలపైన పట్టాలు కప్పిన దృశ్యం

ఖమ్మం మార్కెట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం పడిన వానకు పత్తి బస్తాలు స్వల్పంగా తడిశాయి. ఉదయం సమయంలోనే ఆకాశం మేఘావృతం కావడంతో అప్రమత్తమైన మార్కెట్ అధికారులు టార్పాలిన్ పట్టాలు తీసుకోవాలని మైకుల ద్వారా రైతులకు సూచనలు చేశారు. దీంతో టార్పాలిన్ పట్టాల తీసుకున్న రైతులు బస్తాలపై కప్పిఉంచడంతో భారీ నష్టం తప్పింది. అప్పటికీ పలు చోట్ల స్వల్పంగా పత్తిబస్తాలు తడిచాచి. ఇక గురువారం ఖమ్మం మార్కెట్‌కు సుమారు 15 వేల పత్తి బస్తాలు అమ్మకానికి రాగా వాటిలో కొంత మేర బస్తాలు స్వల్పంగా తడవడంతో వ్యాపారులు కొర్రీలు పెట్టారు. కానీ మార్కెట్ అధికారుల జోక్యం చేసుకోవడంతో వ్యాపారులు ధర తగ్గించకుండానే కొనుగోలు చేశారని పలువురు రైతులు పేర్కొన్నారు. మార్కెట్లో క్వింటా పత్తి గరిష్ఠంగా రూ.7వేలు పలుకగా నాణ్యతను బట్టి క్వింటాలు రూ.4,500 నుంచి రూ. 6,700 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. పత్తి కొనుగోళ్లను మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

## క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్‌తో మోసం

తిరుమలాయపాలెం, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): సమాజంలో వస్తున్న నూతన టెక్నాలజీని వినియోగించుకుని కొత్త తరహా దొంగతనాలకు పాల్పడుతున్నారు. మండలంలోని దమ్మాయిగూడేనికి చెందిన బత్తుల వెంకన్న ఖమ్మం, వరంగల్ రహదారి హైవే పక్కన సూపర్‌మార్కెట్ నిర్వహిస్తున్నాడు. మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ వాడకం ఈజీ ప్రాసెస్ అయింది. అయితే సూపర్‌మార్కెట్‌లో నిర్వాహకులు భారత్‌పే క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తి ఈనెల 7న సూపర్‌మార్కెట్‌కు వచ్చాడు. అక్కడే కూర్చుని షాపు నిర్వాహకులు ఏర్పాటు చేసిన స్టిక్కర్ తొలిగించి అగంతకుడు తయారు చేసిన స్టిక్కర్ అతికించాడు. బయట ఉన్న కూల్ డ్రింక్‌బాటిల్ తీసుకుని వెళ్లాడు. అప్పటినుంచి ఆ అకౌంట్‌లోకి మనీ ట్రాన్స్‌ఫర్ కావడంలేదు. దీంతో అనుమానం రావడంతో వెంకన్న తన ఖాతాని చెక్‌చేశాడు. స్టిక్కర్‌లో భారత్‌పే అకౌంట్‌లోకి మనీ ట్రాన్స్‌ఫర్ కాకపోవడంతో దొంగ అతికించి స్టిక్కర్ స్కాన్‌చేయగా వేరే అకౌంట్ పేరు వస్తుంది. దీంతో సీసీ పుటేజీ పరిశీలించగా అసలు విషయం బయటపడింది. దీంతో వెంకన్న గురువారం తిరుమలాయపాలెం పోలీసులను ఆశ్రయించాడు. దొంగ అతికించిన స్టిక్కర్ స్కాన్ చేయగా దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి భార్య పేరు వస్తుందని వివరించాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జగదీష్ తెలిపారు.

## వృత్తి నైపుణ్య శిక్షణా సంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం


ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ అర్హులైన మైనారిటీల కోసం వివిధ రంగాలలో వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉద్యోగ కల్పన కోసం వృత్తి శిక్షణ సంస్థలను (ట్రైనింగ్ పార్ట్‌నర్)లుగా నియమించుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గవర్నమెంట్, జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థతో అనుసంధానం అయి ఉన్న వృత్తి శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను వి. వెంకటాయపాలెంలోని కొత్త కలెక్టరేట్ ఆఫీస్‌లో గల ఖమ్మం జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ, కార్యాలయం లో నవంబర్ 6వ తేదీ లోపు సమర్పించాలని, ఇతర వివరాలకు 9704003002 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

### అతిథి అధ్యాపక పోస్టులకు...

కరకగూడెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భట్టుపల్లి పంచాయతీ భట్టుపల్లి కస్తూర్బా గాంధీ పాఠశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఇంగ్లీష్ సబ్జెక్టు బోధించడం కోసం ఒక సంవత్సరం కాల పద్ధతిలో 2025-26 ఏప్రిల్ వరకు పనిచేయుటకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసి అయి ఉండాలని.. ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

## విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవరుచుకోవాలి

» పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

ఖమ్మం అర్బన్ అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవరుచుకోవాలని పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నున్నా అప్పారావు అన్నారు. టి. సంతోష్ అధ్యక్షతన ఖమ్మంలోని జెడ్పీ మీటింగ్ హాల్‌లో గురువారంజరిగిన పీడీఎస్‌యూ 22వ జిల్లా మహాసభ లో ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధికి విద్య ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రస్తుత పాలకులు విద్యను వ్యాపార సరుకుగా మార్చటంతో పేద విద్యార్థులకు విద్యభారం అవుతోందన్నారు. కార్పొరేట్ నుకూల విధానం వల్ల ప్రస్తుత సమాజంలో ప్రశ్నించే తత్వం కొరవడుతోందన్నారు. కార్పొరేట్ విద్యాలయాలు విద్యార్థులను మల్టీనేషనల్ కంపెనీలకు బానిసలుగా మారుస్తున్నాయన్నారు. నూతన విద్యావిధానం పేరుతో విద్యారంగంపై మతాన్ని పులుముతున్నారని ఆరోపించారు. సామాజిక స్పృహ కలిగి ఉండి తమ లక్ష్యాలను సాధించుకోవాలన్నారు. సీపీఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాతా సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు తమ తరగతి పుస్తకాలతో పాటు సమాజాన్ని నిత్యం అధ్యయనం చేయటం అలవరుచుకోవాలన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర పధాన కార్యదర్శి ఏ. సాంబ, రాష్ట్ర నాయకులు జె.గణేష్, పీవైఎల్‌జిల్లా నాయకులు ఆర్ సతీష్, గోపీచంద్, రాజేష్, కె. చందు, లోకేష్ తరుణ్, మనోహర్, స్వాతి తదితరుల పాల్గొన్నారు.

## జీవితంలో త్వరగా స్థిరపడాలి: ఐటీడీఏ పీవో



శిక్షణ పొందిన డ్రైవర్లతో ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఐటీ డీఏలోని వైటీసీ ద్వారా ఎల్ఎంవీ, వరంగల్ జోనల్ డ్రైవింగ్ కాలేజీలో హెచ్ఎంవీ డ్రైవింగ్ శిక్షణ తీసుకున్న వారు వివిధ సంస్థలను సంప్రదించి డ్రైవరు ఉద్యోగాల్లో చేరాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ కోరారు. గురువారం ఐటీడీఏ పీవో ఛాంబర్‌లో డ్రైవింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న వారితో పీవో రాహుల్ మాట్లాడారు. త్వరగా డ్రైవరు ఉద్యోగాల్లో చేరి జీవితంలో స్థిరపడాలని అన్నారు. డ్రైవరు ఉద్యోగాలు ఎక్కువగా లభించే ప్రాంతాలైన ట్రాన్స్‌పోర్టు సంస్థలు, సింగరేణి బొగ్గు గనుల, విమానాశ్రయాలు తదితర ప్రాంతాలకు వెళ్లి ధృవపత్రాలను చూపించి ఉద్యోగాల్లో చేరాలని అన్నారు. డ్రైవరు ఉద్యోగాలు పొందిన తరువాత మీ వ్యక్తిగత రక్షణతో పాటు ప్రజల రక్షణ, మీ కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు, జేడీఎం హరికృష్ణ, గిరిజన యువకులు పాల్గొన్నారు.




## 'కూలి భరోసా' అమలు చేయాలి...

**వ్యవసాయ కార్మిక సంఘం పాలేరు డివిజన్ అధ్యక్షుడు కొప్పుల**

నేలకొండపల్లి,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి):రైతులకు రైతు భరోసా ఇస్తున్నట్లుగా, భూమి లేని వ్యవసాయ కూలీలకు కూలి భరోసా ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం పాలేరు డివిజన్ అధ్యక్షుడు కొప్పుల వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నేలకొండపల్లి రావెళ్లభవన్‌లో జరిగిన వ్యవసాయ కూలిసంఘం మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు.రెక్కల కష్టమే ఆస్తిగా కూలి పనులు చేసుకుంటూ జీవితం గడిపే గ్రామీణ పేదలకు ఒక్కో కుటుంబానికి రూ.20వేలు అందించాలన్నారు. ఈ సమావేశంలో దుగ్గి నర్సింహారావు, కట్టెకోల వెంకటేశ్వర్లు, పెద్దపాక మల్లేశ్వరరావు, కొలికపంగు వెంకటనర్సు, సామల మల్లికార్జున్ పాల్గొన్నారు.

# ప్రతిపాదనలతోనే సరి.. నిర్మాణం ఎప్పుడో మరి?

- ఆటోనగర్ నుంచి మార్కెట్ రహదారికి కలగని మోక్షం
- డబుల్ రోడ్డు వేసేందుకు గతంలో ఆర్‌అండ్‌బీ అధికారుల ప్రతిపాదనలు
- గుంతలమయంగా మారిన రహదారి

ఖమ్మంరూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ నుంచి మద్దులపల్లి మార్కెట్ యార్డుకు వెళ్లే రహదారి పరిస్థితి అధ్వానంగా మారింది. దశాబ్దకాలంగా ప్రతిపాదనలతోనే అధికారులు సరిపెట్టడం తప్ప రోడ్ నిర్మాణానికి మాత్రం మోక్షం లభించడంలేదు. దీంతో ఈ రహదారిలో ప్రయాణించాలంటే నరకయాతన పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేండ్ల క్రితం ఈ రహదారి నిర్మాణానికి అడుగులు పడ్డాయి. ఆటోనగర్ నుంచి పోస్నేకల్లు వరకు రోడ్ నిర్మాణం కోసం మెటల్ వేశారు. ఆటోనగర్ నుంచి మార్కెట్ వరకు డబుల్ రోడ్డు వేసేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ వెంటనే అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయింది. అనంతర క్రమంలో రోడ్‌నిర్మాణం మాత్రం ముందుకు సాగడంలేదు. వ్యవసాయ మార్కెట్ ప్రారంభంకాక ముందే వసతులు కల్పించాల్సిన అధికారులు ఆ దిశగా ప్రయత్నం చేయలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



ఆటోనగర్ నుంచి మార్కెట్‌కు వెళ్లే రహదారి

**గుంతలమయంగా రహదారి...**

మార్కెట్ యార్డుకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యం పలు రకాల వాహనాలు వెళుతుంటాయి. అయితే అయిదేళ్ల క్రితం కంకర వేసి వదిలేశారు. ఇప్పుడు రోడ్డుపై కంకరతేలి గుంతలమయంగా మారింది. కంకర తేలిఉండటంతో వాహనదారులు, ప్రజలు ఆ రహదారిపై నడిచేపరిస్థితి లేకుండా పోయింది. ఇటీవల కాలంలో ఈ రహదారి వెంట పలు కాలనీలు వెలిశాయి. యార్డుకు వెళ్లే రోడ్డు కావడంతో ముమ్ముందు అభివృద్ధి చెందుతుందని చాలామంది ఇళ్లు నిర్మించుకున్నారు. ప్రస్తుతం నివాసం ఉంటున్నారు.

**అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా..**

ఈ రహదారి మొత్తం గుంతలమయంగా మారడంతో పాటు రహదారి వెంట చెట్లు పొదలు ఏర్పడ్డాయి. దీంతో ఈ రహదారి అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మద్యం ప్రియులు, గంజాయి తాగే యువకులు పోలీసుల కంటపడకుండా ఉండేందుకు ఈ డొంక మార్గాన్నే ఎంచుకున్నారు. రాత్రి సమయంలో నిఘా తక్కువగా ఉండటంతో అక్రమార్కులు ఈ రహదారినే ఎంచుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ రహదారిని వెంటనే పూర్తి చేయించాలని స్థానిక ప్రజలు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లేందుకు సిద్ధం అయ్యారు.

## జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు హార్వెస్ట్ విద్యార్థిని



విద్యార్థినులను అభినందిస్తున్న రవిమారుత్, పార్వతీరెడ్డి

ఖమ్మంస్పోర్ట్స్,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): త్వరలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు తమ కళాశాల విద్యార్థిని జీడీ.హస్విక ఎంపికైనట్లు కళాశాల యజమాన్యం తెలిపింది. హస్వినీ ఈనెల 18నుంచి 20 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికైందని తెలిపారు. రాష్ట్రపోటీల్లో మరో విద్యార్థిని సాయికృతికానైనా కాంస్య పతకం సాధించిందని వారు తెలిపారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి, అభినందించారు.

## నేడు సత్యసాయిబాబా శతజయంత్యుత్సవం

నేలకొండపల్లి,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలోని సత్యసాయిమందిరంలో శుక్రవారం శతజయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవాసమితి సభ్యులు ప్రకటించారు. శుక్రవారం ఉదయం 5గంటలకు నగరసంకీర్తన, 7 గంటలకు పంచామృతాలతో అభిషేకం, సత్యసాయి బాబావ్రతాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు వస్త్రవితరణ, అంతరం అన్నప్రసాద వితరణ ఉంటాయని చెప్పారు.

## ఉపాధ్యాయుల నిరసన

ఖమ్మంఖానాపురంహవేలి,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):యూటీఎఫ్ తిరుమలాయపాలెం మండల అధ్యక్షుడు భూక్యా కేశ్యా అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం భక్తరామదాసు కళాక్షేత్రం వద్ద నిరసన తెలిపారు. రాష్ట్రఉపాధ్యక్షులు చావా.దుర్గాభవాని ఆధ్వర్యంలో డీఈవోకి వినతిపత్రం అందించారు.

## ప్రజారోగ్యానికే తొలి ప్రాధాన్యం

- మేయర్ పునుకొల్లు నీరజ
- 10, 11, 52 డివిజన్లలో తనిఖీ

ఖమ్మంకార్పొరేషన్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి):ప్రజాఆరోగ్యానికే తొలిప్రాధాన్యత ఇవ్వాలని అందమైన నగరంగా ఖమ్మం మారాలని మేయర్ పునుకొల్లు నీరజ ఆదేశించారు. నగరంలో పారిశుధ్యం, పరిశుభ్రత, గ్రీనరీలపై ఆమె దృష్టి సారించారు. ఇప్పటికే కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి ఆదేశాలతో పదిరోజుల పారిశుధ్య కార్యాచరణ ప్రణాళికను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అమలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే మూడు రోజులుగా మేయర్ డివిజన్లలో తనిఖీలు చేపట్టారు. గురువారం నగరంలోని 10,11,52డివిజన్లలో తనిఖీలు చేశారు. కార్మికుల హాజరు రికార్డులను పరిశీలించారు. ప్రధానరహదారుల వెంట పాదయాత్ర చేసి ప్రజాభిప్రాయం సేకరించారు. పారిశుధ్యం, డ్రెయినేజీలు, గ్రీనరీలు, డివైడర్లు నిర్వహణపై పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన రహదారుల పరిశుభ్రతే కాకుండా అంతర్గత రహదారులను పరిశుభ్రంగా ఉంచాలని,ఏరోజు చెత్తను అదేరోజు తొలగించాలన్నారు. ఖాళీస్థలాల యజమానులకు నోటీసులు ఇవ్వాలని వారు స్పందించకుంటే బహిరంగంగాబోర్డులు పెట్టాలని అప్పటికి దారిలోకి రాకుంటే మునిసిపల్ యాక్టు మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, ఏఎంసీ అనిల్, ఉద్యానఅధికారి బెల్లం రాధిక, కాంగ్రెస్ నాయకుడు సరిపూడి సతీష్ పాల్గొన్నారు.



11వ డివిజన్‌లో ఆదేశాలిస్తున్న మేయర్

## ఏఎన్‌ఎం శిక్షణతో ఉపాధి అవకాశాలు

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కళావతి బాయి

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌ఎం శిక్షణతో ప్రతీ ఒక్కరికి మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని, వాటిని అందిపుచ్చుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.కళావతిబాయి అన్నారు. గురువారం నగరంలోని టేకులపల్లి మహిళా ప్రాంగణంలో ఎంపీహెచ్‌డబ్ల్యు విద్యార్థుల క్యాపింగ్ మహోత్సవానికి జిల్లా సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ నరేందర్‌తో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద విద్యార్థినులకు మహిళా ప్రాంగణం అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఇక్కడ నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులుఏటా స్టేట్ ర్యాంకులు సాధించటం జిల్లాకు గర్వకారణంగా ఉందని అన్నారు.ఇక్కడ అభ్యసిస్తున్న విద్యార్థులకు భవిష్యత్తులో ఏదేని ఉద్యోగ అవకాశాలు ఉంటే తప్పకుండా వారి పేరును పరిగణలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ రెండు సంవత్సరాలు కష్టపడి చదువుకుంటే రాబోయే భవిష్యత్తు సంవత్సరాలు జీవితంలో స్థిరపడి సుఖంగా జీవించవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో డీపీహెచ్.ఎన్ శేషపద్మ మహిళా ప్రాంగణాధికారి వేల్పుల విజేత, నందగిరి శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది నాగసరస్వతి, స్పందన, మల్లిక, విజయ్ కుమార్, సుధీర్, సుకన్య, లాలయ్య, మౌనిక, దుర్గారావు, శాంతమ్మ, కళ్యాణి పాల్గొన్నారు




విద్యార్థినులకు క్యాపింగ్ అందిస్తున్న కళావతిబాయి

## అమరవీరుల కుటుంబ సభ్యులతో సీపీ భేటీ

ఖమ్మంక్రైం, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తన కార్యాలయంలో గురువారం పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులతో భేటీ అయ్యారు. ఈసందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు, వారి సమస్యలను వివరించారు. ప్రధానంగా ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలాల సమస్యలపై మాట్లాడారు. దీనిపై సీపీ సానూలంగా స్పందించారు. ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రక్రియ మొదలుపెట్టారని వివరించారు.

## ఐదు కంప్యూటర్లు అందజేసిన పూర్వ విద్యార్థి

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రిక్కా బజార్ పాఠశాలలో 1974-75లో పదోతరగతి చదివిన విద్యార్థి వాసిరెడ్డి శ్రీనివాసరావు ఐదు కంప్యూటర్లను గురువారం పాఠశాలకు వితరణగా అందించారు. ఆయన ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఉద్యోగవిరమణ పొందారు. ఆయన తల్లిదండ్రులు ఇదేపాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేశారు. ఆయన సతీమణి కృష్ణవేణి ఇదే పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేశారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు అవుతూ వారివంతు సహాయాన్ని పాఠశాలకు అందించారు.ఈ సహాయానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.శాంత స్టాఫ్ సెక్రెటరీ కట్ట శేఖర్‌రావు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు విస్తరణ ప్రారంభం

ఖమ్మంఅర్బన్,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రైల్వేస్టేషన్ ప్రాంతంలో రోడ్ల విస్తరణ చర్యలను మునిసిపల్ అధికారులు గురువారం చేపట్టారు.స్టేషన్‌రోడ్డు తోపాటు అనుసంధానంగా ఉన్న పోస్టాఫీస్ రోడ్డును వెడల్పు పనులు ప్రారంభించారు. రోడ్ల విస్తరణలో భాగంగా రోడ్లకు రెండు వైపులా ఏర్పాటు చేసిన బడ్డీకొట్లు, తదితర ఆక్రమణలను తొలగించారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిరుమలాయపాలెం, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకరవాయి సమీపంలో మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను గురువారం ఎస్‌ఐ జగదీష్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న సమాచారంతో తనిఖీలు నిర్వహించారు.

# పాఠశాల విద్యపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

- బడుల బలోపేతానికి కాయకల్ప చికిత్స
- పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు వివరాల సేకరణ

బోనకల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక దృష్టి సారించారు. బడుల బలోపేతానికి కాయకల్ప చికిత్సకు శ్రీకారం చుట్టారు. గతంలో పని చేసిన కలెక్టర్లకు భిన్నంగా ప్రస్తుత కలెక్టర్ ప్రాథమిక విద్య గురించి లోతుగా ఆలోచించి చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి అధికారులకు దిశానిర్ధేశం చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్క నియోజకవర్గమైన మధిరను అన్ని రంగాల్లో పరుగులు పెట్టించాలన్న భట్టి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్న ఆలోచనలో అధికారులు పట్టుదలతో పని చేస్తున్నారు. ఇందులో బాగంగానే ప్రధానంగా విద్యారంగం పై దృష్టి పెట్టడంతో కలెక్టర్ ప్రత్యేకంగా మధిర నియోజకవర్గంలోని బడుల స్థితిగతుల వివరాలను సేకరించాలని ఆదేశించారు. దింతో ప్రతి పాఠశాలలో ఉన్న వనరులు, సమస్యల గురించి ప్రత్యేకమైన యాప్‌లో ఉపాధ్యాయుల నుంచి సమాచారాన్ని ఎంఈవోలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. అదనపు కలెక్టర్ శ్రీజ ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో మధిర నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలో సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్య, విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఆటస్థలాలు, ఫర్నిచర్ తదితర వివరాల గురించి చర్చించారు. మధిర నియోజకవర్గంలోని అన్ని బడులను కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా వసతులను కల్పించి వీలును బట్టి ప్రీ ప్రైమరీ తరగతులను కూడ వచ్చే ఏడాది నుంచి నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కలెక్టర్ ప్రాథమిక స్థాయిలో విద్యార్థులంతా చదవడంలో ముందుండాలన్న దృక్పథంతో ఈ నెల 27 నుంచి వచ్చే నెల 30 వరకు ప్రతి పిల్లవాడు చదవాలన్న కార్యక్రమాన్ని అమలు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ప్రతి పాఠశాలకు ప్రత్యేకమైన బుక్‌లెట్ పంపిణీ చేసి అందులో ఉన్న పదాలను విద్యార్థులతో చదివించాల్సి ఉంటుంది. ఇంగ్లీషు సులభతరంగా విద్యార్థులు నేర్చుకునేలా ప్రతిరోజు పాఠశాలలో ఒక గంట పాటు డ్రిల్లింగ్ చేయించాలని ఆదేశించారు. వారంలో ఒకరోజు విద్యార్థులను పరీక్షించి కలెక్టర్ రూపొందించిన యాప్‌లో నమోదు చేయాలి. ఈ వివరాలను యాప్‌లో జిల్లా అధికార యంత్రాంగం అంతా పర్యవేక్షిస్తుంటారు. వచ్చేనెల 30నాటికి అందరూ ఆంగ్లంలో చదవ గలిగే సామర్థ్యాలను సాధించేటట్లు లక్ష్యాలను నిర్ధేశించారు.

## 29న నేలకొండపల్లిలో మెగా రక్తదాన శిబిరం

**నేలకొండపల్లి ఎస్‌ఐ సంతోష్**



మాట్లాడుతున్న ఎస్‌ఐ సంతోష్

నేలకొండపల్లి,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): పోలీస్‌అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఈనెల29న నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేయనున్న మెగారక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని నేలకొండపల్లి ఎస్‌ఐ పెంటరి సంతోష్ మండల ప్రజలకు పిలుపునిచ్చారు. రోడ్డుప్రమాద బాధితులు, సికిల్‌సెల్, డెంగ్యూ వ్యాధిగ్రస్తులు ముఖ్యంగా తలసీమియాతో బాధితులను ఆదుకోవటానికి దాతలిచ్చిన రక్తం ఉపయోగపడుతుందని సంతోష్ అన్నారు. చాలా సందర్భాల్లో రక్తం దొరక్క మరణాలు సంభవించిన సంఘటనలు కోకొల్లలన్నారు.అలాంటి వారిని దృష్టిలో ఉంచుకుని, పోలీస్ అమరుల త్యాగాలను స్మరించుకుంటూ, 29 బుధవారం మెగారక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. యువత పెద్దసంఖ్యలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిరక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

## రెవెన్యూశాఖ పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి

- 15రోజుల్లో స్పష్టమైన మార్పు కనిపించాలి
- రెవెన్యూ సదస్సుల దరఖాస్తులు 4నెలలుగా పెండింగ్‌పై ఆరా

ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెవెన్యూశాఖ పనితీరు సంతృప్తికరంగా లేదని, సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలని, రాబోయే 15రోజుల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, కల్లూరు డివిజన్ సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్‌తో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, సాదాబైనామా, భూభారతి, సెక్షన్ 22 ఏ1, భూ సేకరణ, ప్రభుత్వభూముల సంరక్షణ, మీసేవ సర్టిఫికెట్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులపై కలెక్టర్ చర్చించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూశాఖ పనితీరు ఆధారంగా ప్రభుత్వానికి పేరు వస్తుందని, రోజువారి వ్యవహారాల్లో ప్రజలతో సంబంధాలు ఉంటాయన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా ఖమ్మండివిజన్ పరిధిలో సాదాబైనామా మినహాయించి వచ్చిన దరఖాస్తులు 4నెలలు గడిచిన తర్వాత కూడా ఖమ్మం డివిజన్, కల్లూరు డివిజన్ పరిధిలో పెండింగ్ ఉండటానికి గల కారణాలను కలెక్టర్ మండలాల వారీగా ఆరాతీశారు. జిల్లాలో ఆమోదించిన దరఖాస్తులలో కొన్నిదరఖాస్తులు మాత్ర మే భూభారతిలో అప్‌డేట్ కావడం పట్ల కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ సదస్సుల తర్వాత అధికారులు, సిబ్బంది విధుల పట్ల తీవ్రఅలసత్వంగా వ్యవహరిస్తున్నారని, పనిచేయడం ఇష్టం లేని పక్షంలో సెలవుపై వెళ్లాలన్నారు. అనవసరంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని కలెక్టర్ అన్నారు. అటవీ- రెవెన్యూ శాఖ వివాదాస్పద భూముల దరఖాస్తులపై సర్వే చేయించి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు. సాదాబైనామా దరఖాస్తులకు 100శాతం నోటీస్ జనరేట్ చేయాలని,పొరబాట్లు లేకుండా క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం, జవహర్ ఎత్తిపోతల పథకం, ఎస్సారెస్పీ స్టేజి 2 నీటిపారుదల ప్రాజెక్టు పనుల భూసేకరణపై కలెక్టర్ చర్చించారు.ఈ సమావేశంలో జిల్లారెవెన్యూఅధికారి ఏ.పద్మశ్రీ, సర్వే ల్యాండ్ రికార్డ్ ఏడీ శ్రీనివాసులు, ఖమ్మం రెవెన్యూ డివిజన్ అధికారి నరసింహారావు,తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్





## సోలార్ ప్లాంట్ కోసం అధికారుల స్థల పరిశీలన

కల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలోని చిన్నకోరుకొండి గ్రామంలో సోలార్ ప్లాంట్ నిర్మాణానికి డీఆర్డీఏ పీడీ సన్యాసయ్యతోపాటుగా పలువురు అధికారులు గురువారం సదరు స్థలాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. చిన్నకోరుకొండి గ్రామ సమీపాన నాలుగు ఎకరాల స్థలాన్ని గతంలో మండల స్థాయి అధికారులు ఎంపిక చేయడం జరిగింది. సదరు స్థలంలో సుమారు ఒక కోటి రూపాయిల అంచనాతో నిర్మాణం చేపట్టాలని అధికారులు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సోలార్ ప్లాంట్ మరి కొద్ది రోజుల్లో నిర్మాణం జరుగుతుందని తెలిసింది. ఈ కార్యక్రమంలో తహిసిల్దార్ పులి సాంబశివుడు, ఎంపిడిఓ చంద్రశేఖర్, ఏపిఎం అశోకారాణి, ఉపాధిహామి ఏపిఓ హేమమాలిని, సీసీలు పాల్గొన్నారు.

## 26న మెగా జాబ్‌మేళా

» సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి



అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి సంస్థ, టాస్క్ సంయుక్త సహకారంతో ఈనెల 26న సత్తుపల్లిలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. 5వేల ఉద్యోగాల భర్తీ కోసం హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు చెందిన 50కు పైగా కంపనీలు సత్తుపల్లికి వచ్చి ఈ జాబ్‌మేళాలో పాల్గొనున్నాయని, ఈ సదావకాశాన్ని యువత సద్వినియోగించుకోవాలని కోరారు. నియోజకవర్గ చరిత్రలో నిరుద్యోగ యువత కోసం ఈ జాబ్ మేళా నిర్వహించడం ఇదే మొదటిసారి అని, యువతీ, యువకుల బంగారు భవిష్యత్ కోసం తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. అనుభవం కలిగిన హెచ్‌ఆర్‌లతో కెరీర్‌పై అవగాహన, ఇంటర్వ్యూ స్కిల్స్, రెజ్యూమ్ ప్రిపరేషన్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. అనంతరం నియోజకవర్గంలోని సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాలకు చెందిన 20మందికి రూ.5,49,000విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు అందజేశారు. అదేవిధంగా విద్యార్థులకు ఉచితంగా అందించేందుకు ఆషా స్వచ్ఛంద సంస్థ ప్రచురించిన 2వేల వేమనశతక పుస్తకాలను అందించారు.

## పాఠశాల విద్యపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

» బడుల బలోపేతానికి కాయకల్ప చికిత్స

» పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు వివరాల సేకరణ

బోనకల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక దృష్టి సారించారు. బడుల బలోపేతానికి కాయకల్ప చికిత్సకు శ్రీకారం చుట్టారు. గతంలో పని చేసిన కలెక్టర్లకు భిన్నంగా ప్రస్తుత కలెక్టర్ ప్రాథమిక విద్య గురించి లోతుగా ఆలోచించి చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గమైన మధిరను అన్ని రంగాల్లో పరుగులు పెట్టించాలన్న భట్టి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్న ఆలోచనలో అధికారులు పట్టుదలతో పని చేస్తున్నారు. ఇందులో బాగంగానే ప్రధానంగా విద్యారంగం పై దృష్టి పెట్టడంతో కలెక్టర్ ప్రత్యేకంగా మధిర నియోజకవర్గంలోని బడుల స్థితిగతుల వివరాలను సేకరించాలని ఆదేశించారు. దింతో ప్రతి పాఠశాలలో ఉన్న వనరులు, సమస్యల గురించి ప్రత్యేకమైన యాప్‌లో ఉపాధ్యాయుల నుంచి సమాచారాన్ని ఎంఈవోలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. అదనపు కలెక్టర్ శ్రీజ ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో మధిర నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలో సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్య, విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఆట స్థలాలు, ఫర్నిచర్ తదితర వివరాల గురించి చర్చించారు. మధిర నియోజకవర్గంలోని అన్ని బడులను కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా వసతులను కల్పించి వీలును బట్టి ప్రీ ప్రైమరీ తరగతులను కూడ వచ్చే ఏడాది నుంచి నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కలెక్టర్ ప్రాథమిక స్థాయిలో విద్యార్థులంతా చదవడంలో ముందుండాలన్న దృక్పథంతో ఈ నెల 27 నుంచి వచ్చే నెల 30 వరకు ప్రతి పిల్లవాడు చదవాలన్న కార్యక్రమాన్ని అమలు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ప్రతి పాఠశాలకు ప్రత్యేకమైన బుక్‌లెట్ పంపిణీ చేసి అందులో ఉన్న పదాలను విద్యార్థులతో చదివించాల్సి ఉంటుంది. ఇంగ్లీషు సులభతరంగా విద్యార్థులు నేర్చుకునేలా ప్రతిరోజు పాఠశాలలో ఒక గంట పాటు డ్రిల్లింగ్ చేయించాలని ఆదేశించారు. వారంలో ఒకరోజు విద్యార్థులను పరీక్షించి కలెక్టర్ రూపొందించిన యాప్‌లో నమోదు చేయాలి. ఈ వివరాలను యాప్‌లో జిల్లా అధికార యంత్రాంగం అంతా పర్యవేక్షిస్తుంటారు. వచ్చే నెల 30నాటికి అందరూ అంగ్లంలో చదవ గలిగే సామర్థ్యాలను సాధించేటట్లు లక్ష్యాలను నిర్ధేశించారు.

## మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలి

తల్లాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ప్రభుత్వం అరికట్టాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు శీలం ఫకీరమ్మ డిమాండ్ చేశారు. తల్లాడ మండలం గోపాలపేట గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన మహిళ సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీ పడుతున్నప్పటికి మహిళలకు ప్రోత్సాహం కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల్లో దాగున్న ప్రతిభను వెలికితీసేలా సహాయ సహకారాలు అందించడానికి ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. హైదరాబాద్‌లో జరగనున్న మహిళ సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మహిళ సంఘం మండల నాయకులు పేరసాని లత, విజయ, దొడ్డపిన్ని నారాయణమ్మ, ఆలస్యం విజయ, యల్లంకి లక్ష్మీసుధా, తులిశమ్మ, గార్లపాటి యశోద, పోట్ల లక్ష్మీవేద, విజయమ్మ పాల్గొన్నారు.

## చెక్ పోస్ట్‌లో పత్తి తేమ తనిఖీ యంత్రం ఏర్పాటు

కారేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అదేశాలనుసరించి పత్తి రైతుల సౌకర్యార్థం ఇల్లందు వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కామేపల్లి మండలం ముచ్చర్ల చెక్‌పోస్ట్‌లో పత్తి తేమ శాతం పరిశీలించే యంత్రం ఏర్పాటు చేసినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎన్.నరేష్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడుతూ.. కారేపల్లి మండల కేంద్రంలోనే సీసీఐ కేంద్రానికి పత్తిని తీసుకువచ్చే రైతులు ముందుగా చెక్‌పోస్ట్‌లో యంత్రం ద్వారా పరిశీలించుకోవచ్చునని, దానికి అనుగుణంగానే పత్తిని సీసీఐ కేంద్రానికి తీసుకవచ్చి విక్రయించుకోవాలన్నారు. కేంద్రానికి వచ్చిన తరువాత అధిక తేమశాతం ఉండడంతో రైతులు తెచ్చినపత్తిని అధికారులు అనుమతించక పోతే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంటుందనే ఉద్దేశంతో ముచ్చర్ల చెక్ పోస్ట్‌లో ముందుగా చెక్ చేసుకున్న తరువాతే సీసీఐ కేంద్రానికి తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలుపై సెర్ప్ సిబ్బందికి శిక్షణ




పెనుబల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ప్ ఆధ్వర్యంలో వానాకాలం ధాన్యం కొనుగోలుపై ఏడు మండలాల సెర్ప్ సిబ్బందికి గురువారం పెనుబల్లి రైతువేదికలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.జయశ్రీ, డీపీఎం ఆలేటి శ్రీనివాసరావు, ఏవో ఏవీఎస్. ప్రసాదరావు శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడుమండలాలకు ఏపీఎంలు, సీసీలు, ఓబీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థిని అదృశ్యం

చింతకాని, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని అదృశ్యమైనట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. సదరు విద్యార్థిని ఖమ్మంలోని ఓ సాంఘీక సంక్షేమ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. గత నెల 20వ తేదీన దసరా సెలవులకు ఇంటికి వచ్చింది. బాత్‌రూంకి వెళ్తున్నానని చెప్పి బుధవారం రాత్రి బయటకు వెళ్లిన విద్యార్థిని తిరిగి ఇంటికి రాలేదు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వ్యవసాయ కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాలు

పెనుబల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాసరావు విమర్శించారు. గురువారం పెనుబల్లిలో వ్య.కా.సం మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నల్లధనాన్ని తెచ్చి పేదల బతుకులు మారుస్తామని మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకుందని విమర్శించారు. జీరో అకౌంట్లలో డబ్బులు ఎప్పుడు వేస్తారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ పథకాన్ని అమలుచేయకుండా మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో వ్య.కా.సం నాయకులు గాయం తిరుపతిరావు, చమటా విశ్వనాథం, కుంజా రాములు, రాజినేని మంగమ్మ, కర్రి కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, రేసు పద్మ, బుచ్చయ్య, గొల్లమండల మంగమ్మ పాల్గొన్నారు.

## శిక్షణ డీఎస్పీ లక్ష్మీసాహితికి వేద పండితుల సన్మానం

వైరా, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలోని తొమ్మిదోవార్డు లీలాసుందరయ్యనగర్‌లో నివాసముంటూ గ్రూప్-1లో డీఎస్పీగా ఎంపికై శిక్షణకు వెళ్తున్న సంగెపు లక్ష్మీసాహితీని గురువారం శ్రీసత్యసాయి వేదపాఠశాలలో స్థానిక లయన్స్‌క్లబ్, గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో వేద పండితులు, క్లబ్‌ల నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. వేదపాఠశాల ప్రధాన పండితులు కుమారశర్మ అవధాని వేదమంత్రోశ్చరణలతో లక్ష్మీసాహితీని ఆశీర్వదించి సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ గ్రేట్ విజన్‌క్లబ్‌ల నిర్వాహకులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, లగడపాటి ప్రభాకర్‌రావు, చింతోజు నాగేశ్వరరావు, చెరుకూరి కృష్ణారావు, వై.రాజారావు పాల్గొన్నారు.



## మార్కింగ్ దాటితే... చర్యలే..!

» సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ కొండ్రా నర్సింహ్మా



వేంసూరు రోడ్డులో మార్కింగ్ చేసిన దృశ్యం

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రత దృష్ట్యా.. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వేంసూర్ రోడ్డులో ఇరువైపులా 19అడుగుల మేర మార్కింగ్ పెట్టామని, ఆ గీత దాటి రోడ్డుపైకి వ్యాపారాలు వస్తే చర్యలు తప్పవని సత్తుపల్లి మునిసిపల్ కమీషనర్ కొండ్రా నర్సింహ్మా హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర సరిహద్దు కావడంతో పట్టణంలో రద్దీ ఎక్కువగా ఉందని, ముఖ్యంగా వేంసూర్ రోడ్డులో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, వాహనదారులు, పాదచారుల ఫిర్యాదుల మేరకు మార్కింగ్ పెట్టామన్నారు. షాపులకు చెందిన ప్రచార బోర్డులు, దుకాణాలు, తోపుడు బండ్లు మార్కింగ్ దాటి రోడ్డుపైకి వస్తే చర్యలు తీసుకుంటామని, ఇడ్లీ బండ్లు రోడ్డుపైకి వచ్చినా, షాపులకు గ్రిల్స్ ఏర్పాటు చేసినా, రేకుల షెడ్ల నిర్మాణం, శాశ్విత కట్టడాలను నిర్మించినా ఉపేక్షించేది లేదన్నారు. ఆక్రమిత స్థలాల్లో ముందుకు వచ్చినట్లయితే మునిసిపల్ ట్రాక్టర్‌లో వస్తువులు, సరుకులు కార్యాలయానికి తరలిస్తామని, జరిమానా విధించడంతో పాటు చర్యలు సైతం ఉంటాయని, ఇప్పటికే గీత దాటి రోడ్డుపైకి వచ్చి నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు ఇచ్చామని చెప్పారు. ఫుట్‌పాత్‌తో పాటు ఆక్రమిత స్థలాల్లో నిర్మించిన బడ్డీకొట్లు, షాపుల విషయంపై కమీషనర్‌కు సూచించగా పరిశీలిస్తామన్నారు. మేనేజర్ శ్రీనివాస్, ఏఈ సురేష్ పాల్గొన్నారు.

## ఘనంగా మహా పడిపూజ

తల్లాడ, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం మల్లారం గ్రామంలో బుధవారం రాత్రి అయ్యప్ప స్వామి మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. స్థానిక అయ్యప్పస్వామి మండపంలో మహాపడిపూజ జరిగింది. అయ్యప్పస్వామికినవరసాలు, పంచామృతాలు, పుష్పలతో అర్చకడు అనిల్ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకుతీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

చింతకాని, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలకు పత్తి, పెసర పంటలను నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మధిర నియోజకవర్గ కార్యదర్శి మడుపల్లి గోపాల్‌రావు కోరారు. గురువారం మండల పరిధిలోని పాతర్లపాడు, రేపల్లెవాడ గ్రామాల్లో సీపీఎం ప్రతినిధి బృందం పాడైన పంటలను పరిశీలించింది. జిల్లా వ్యాప్తంగా వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నవని రైతులకు దిగుబడులు తగ్గి పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పందించి పంట నష్టం సర్వే నిర్వహించి రైతులను ఆదుకోవాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం అందజేయాలన్నారు. పత్తి కొనుగోల్లు వెంటనే ప్రారంభించాలని రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా పత్తి కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రాచబంటి రాము, నాయకులు వత్సవాయి జానకిరాములు, మడిపల్లి కిరణ్‌బాబు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, గడ్డం కోటేశ్వరరావు, నున్నా రామకోటయ్య, మండెపూడి కృష్ణయ్య పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థినుల సమస్యలు పరిష్కరించాలి

పెనుబల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): టేకులపల్లి కేజీబీవీ అనుబంధ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ.. హాస్టల్ విద్యార్థులు సమస్యలతో కొట్టుమిట్టాడుతూ అర్ధాకలితో చదువులు కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల నుంచి వివిధ రకాల ఫండ్స్ పేరుతో రూ.వెయ్యి వసూలు చేస్తున్నారని దీనిపై కలెక్టర్ వెంటనే స్పందించాలని ఆయన కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు బెజవాడ సాయిశేషు, పర్వీన్, బాలాజీ, సత్యా, మోహన్, స్వప్న, నిహారిక, పూజిత, కల్యాణి, హాస్టల్ విద్యార్థినులు పాల్గొన్నారు.

## కేయూ జువాలజీ విభాగం అధిపతిగా పెనుబల్లి వాసి

పెనుబల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం అధిపతిగా పెనుబల్లి మండలం లింగగూడెం గ్రామానికి చెందిన యనమాల వెంకయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వీ.రామచంద్రన్ ఉత్తర్వుల మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఆ విభాగం అధిపతిగా విధులు నిర్వహించిన ప్రొఫెసర్ జి.షమితా పదవీకాలం పూర్తికావడంతో ఆమె స్థానంలో వెంకయ్యను నియమించారు. రెండేళ్లపాటు వెంకయ్య ఈ విభాగం అధిపతిగా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఇదివరకు వెంకయ్య కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించారు.

## డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ముదిగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కాంగ్రెస్ నాయకులు గురువారం కలిశారు. మండలంలోని వనంవారిక్రిష్ణాపురం, ముత్తారం గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలని భట్టి విక్రమార్కకు నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఆయా గ్రామాల్లో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను భట్టి విక్రమార్క నాయకులను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు మల్లెల అజయ్, పొదిలి తిరపయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఎత్తిపోతల పనుల పరిశీలన

చింతకాని, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వందనం గ్రామంలో సుమారు రూ 35 కోట్లతో నిర్మిస్తున్న కొదుమూరు- వందనం ఎత్తిపోతల పథకం రెండవ దశ పైలాన్ నిర్మాణ పనులను మండల కాంగ్రెస్ నాయకుల బృందం గురువారం పరిశీలించింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా రెండవ దశ పనుల శంకుస్థాపన కార్యక్రమం త్వరలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇరిగేషన్ జేఈ సురేష్, నాయకులు ఆవుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## డబుల్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు పద్మజ, రమేష్

కల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒకే భూమిపై అక్రమంగా డబుల్ రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్రభుత్వ పరంగా డిజిటల్ పాస్ బుక్‌లు పొందిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకుని తమ భూమిని కాపాడాలని బాధితులు గురువారం స్థానిక సబ్‌కలెక్టర్‌ను కలిసి వినతిప్రతం అందించారు. ఈ సందర్భంగా సదరు భూమి యాజమాన్య బాధితులైన కల్లూరు పట్టణానికి చెందిన లక్కినేని పద్మజ, రమేష్ విలేకరులకు తెలిపిన సమాచార వివరాలిలా ఉన్నాయి. పెనుబల్లి మండలంలోని ముత్తగూడెం (చింతగూడెం) గ్రామంలోని సర్వేనెం 153-అ లో హైవే నిర్మాణ సమయంలో ల్యాండ్ అక్విజేషన్ చేసిన భూమిని 2018 సంవత్సరంలో ఏపిలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన సింగంశెట్టి రామ్మోహన్ రావు అక్రమంగా తన పేరున సదరు భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుని పాస్‌బుక్ పొందాడని ఆరోపించారు. హైవే పక్కన సర్వే నెం.152-1లో తమ పేరున గల 3 ఎకరాల మామిడి తోట (భూమి) ఉండగా, సదరు తోటకు ముళ్లతీగతో ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సదరు భూమి విషయంలో పెనుబల్లి మండల సర్వేయర్ ఈశ్వరితో నరిసింహారావు కుమ్మకై తమ భూమిపై, హైవేలో తీసుకున్న భూమి సర్వే నెం వేసి నాలా కోసం సర్వేయిర్ సిఫార్సు చేసినట్లు సబ్ కల్టెర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో వారు పేర్కొన్నారు. సదరు భూమి విషయంలో తమకు జరిగిన అన్యాయంపై సత్తుపల్లి కోర్టు పరిధిలో దావా వేయగా విచారణలో ఉన్నట్లు బాధితులు పద్మజ, రమేష్‌లు తెలిపారు. కోర్టు విచారణలో ఉన్న సదరు మామిడి తోట గల తమ భూమిపై ఆగ్నేయా భాగంలో నాలా చేయించుకుని 2022 సంవత్సరంలో మరో వ్యక్తికి బినామిగా రిజిస్ట్రేష్ చేసి తమ భూమిని అక్రమంగా అక్రమించుకొనుటకు ప్రయత్నించుతూ తమపై దౌర్జన్యం, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు వారు విలేకరులకు వివరించారు. ఈ విషయమ్మై విచారణ జరిపి తమ భూమిపై అక్రమ డబుల్ రిజిస్ట్రేషన్‌ను రద్దు పరిచి చట్ట రీత్యా తగిన చర్యలు తీసుకోవాలని వారు సబ్ కల్టెర్ అజయ్‌యాదవ్‌ను కలిసి వారు వినతిపత్రం అందించారు.



## సర్కార్ బడికి స్పీకర్ బాక్స్ వితరణ

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలు కె.ఇందిర సుమారు రూ.22వేల విలువైన బ్లూటూత్ వైర్‌లెస్ ట్రాలీ స్పీకర్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఎం.రామ్మోహనరావు మాట్లాడారు. ఉపాధ్యాయులుగా విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంతోపాటు పాఠశాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని ఆయన అన్నారు. పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రేయర్ నిర్వహణ, విద్యార్థులకు క్విజ్, పోటీపరీక్షలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల అవసరాల నిమిత్తం అందిస్తున్నట్లు చెప్పారు. సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డైనింగ్ హాల్‌ను ప్రారంభించారు. ఉపాధ్యాయులు పీ.వెంకటకృష్ణారావు, ఎస్.సత్యనారాయణరెడ్డి, బీ.పద్మావతి, జీ.యుగంధర్, ఎన్.పద్మజ, హెచ్.హరిలాల్, జీ.కోటేశ్వరరావు, ఫర్హానా పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

» ఇందిర శక్తి కార్యక్రమంలో తహసీల్దార్

మధిర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాదించేందుకు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకుని రాణించాలని మధిర తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు అన్నారు. గురువారం మధిర తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇందిర మహిళా శక్తి కార్యక్రమంలో బాగంగా ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన జీరాక్స్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా బలపడితే ఆ కుటుంబం ఎదుగుదలకు ఉపయోగపడుతుందని అన్నారు, మహిళలు స్వయం శక్తి తో ఎదిగేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను రూపొందించిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, ఏపిఎం సత్యనారాయణ రాజు, ఐకేపి సీసీలు రమాదేవి, పుల్లయ్య పాల్గొన్నారు.

## కంటిచూపు మందగిస్తే ఒకరిపై ఆధారపడక తప్పదు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శరీరభాగాల్లో అన్నింటికంటే నేత్రాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని, కంటిచూపు మందగిస్తే ఒకరిపై ఆధారపడి జీవించడం తప్పదని అటవీ శాఖ రేంజర్ పి.స్నేహలత అన్నారు. సత్తుపల్లి అటవీ శాఖ ఆధ్వర్యంలో స్థానిక టింబర్ డిపోలో ఉద్యోగులు, స్థానికులు అలాగే చంద్రాయపాలెంలోని వన సంరక్షణ సమితి సభ్యులకు ఉచితంగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 95మందికి దృష్టి పరీక్ష, ముత్యబిందు గుర్తింపు, డయాబెటిక్ రెటినోపతి స్క్రీనింగ్ ఇతర నేత్ర సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 20మందికి కంటి సమస్యలను గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకుగానూ ఖమ్మంలోని శరత్ మ్యాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రికి తరలించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్యాంప్ కో-ఆర్డినేటర్ విక్రంసింగ్, ఆప్తమాలజిస్ట్ విసీల, కౌన్సిలర్ శ్రీకాంత్, టెక్నీషియన్ సందీప్, డీఆర్ఓ పిచ్చేశ్వరరావు, సెక్షన్ ఆఫీసర్ నాగరాజు, అరుణ్, నరసింహా, కొండారెడ్డి, బీట్ ఆఫీసర్లు, బేస్ క్యాంప్ సిబ్బంది, ప్రైవేట్ వాచర్లు, చంద్రాయపాలెం వీఎస్ఎస్ సభ్యులు, డివిజన్, రేంజి ఆఫీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.




సత్తుపల్లిలో నేత్ర శిబిరాన్ని ప్రారంభిస్తున్న రేంజర్ స్నేహలత

## అంగన్‌వాడీ కేంద్రాలే చిన్నారుల భవిష్యత్‌కు పునాది



చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న సూపర్‌వైజర్

తల్లాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్‌కు పునాది అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రోజా అన్నారు. గురువారం తల్లాడ ఎన్టీఆర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రోజా మాట్లాడుతూ.. ఆరేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు ఆరోగ్యం, పోషకాహారంతోపాటు విద్యాభివృద్ధిని సమగ్రంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్నట్టు తెలిపారు . గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. పిల్లలకు పోషకాహారంతోపాటు ప్రీస్కూల్ విద్యను ప్రభుత్వం అందించడం ద్వారా వారి భవిష్యత్‌కు అంగన్‌వాడీ కేంద్రాలు పునాదిగా ఉపయోగపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శైలజ, ఆశావర్కర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.